Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 36 పేజీలు 8 వెల : 5 మంగళవారం 29 జూలై 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్: చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

**ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...**

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

**తారీఫ్**

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజి |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



# గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులు

**సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నాం**

**గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులల్లో సహకరించండి**

**సింగపూర్ వాణిజ్యమంత్రి టాన్ సీ లాంగ్‌తో చంద్రబాబు చర్చలు**

అమరావతి: గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపట్టిందని ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సింగపూర్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం చంద్రబాబు అన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని.. ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలను అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ -టె-క్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు- పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే గతంలో హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో సింగపూర్ ఏపీ కలిసి పని చేస్తామని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం టెండర్లు

2వ

## పెట్టుబడులు రాకుండా అడ్డుకునే కుట్రలు



2వ

**ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అధోగతి చేసిన జగన్**

**విపక్షంగా అభివృద్ధిని అడ్డుకుంటున్నవైకాపా**

**వైకాపా నేతల తీరుపై మండిపడ్డ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా**

## 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు



2వ



## జగన్ తన గొయ్యి తానే తవ్వుకున్నారు

**రఘురామను టార్చర్ చేయడం అతిపెద్ద తప్పు**


**హోం మంత్రి అనిత విమర్శలు**

భీమవరం: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. అధికార దుర్వినియోగం చేసి జగన్ అతని గొయ్యి అతనే తవ్వుకున్నారన్నారు. ఎవరిని టచ్ చేయకూడదో జగన్ వాళ్లనే టచ్ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత ఎంపీ రఘురామకృష్ణరాజును క్రూరంగా హింసించారని మంత్రి విమర్శించారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఉప్పుటేరు వంతెన వద్ద హోంమంత్రి అనితకు ఏపీ ఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, కనుమూరి భారత్ ఘన స్వాగతం పలికారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు. వైఎస్ జగన్ తన గొయ్యి తానే తవ్వుకున్నారు. జగన్ ఎవరిని టచ్ చేయకూడదో వాళ్లనే టచ్ చేశారు. ఎవరైనా ఇది తప్పు అని అడిగితే అది సరిచేసుకోవాలి లేదా ఎక్స్‌ప్లనేషన్ ఇవ్వాలి. ఈ రెండు కాకుండా నువ్వు అడిగితే కేసు పెడతా, గట్టిగా మాట్లాడితే జైలుకు పంపిస్తా అన్నట్లు- వ్యవహరించారు. సొంత ఎంపీ రఘురామకృష్ణ రాజును క్రూరంగా హింసించారు. రఘురామకృష్ణరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ మేం ఉన్నాం అని ధైర్యం ఇచ్చారు. ఓటు వేసిన తరువాత ప్రజల పట్ల నాయకుడికి భాధ్యత, జవాబుదారీతనం ఉండాలి. ఈరోజు మేము అంతా జవాబుదారీతనంతో ఉన్నాం. నేను ఓట్లు- అడిగేందుకు రాలేదు. ఆకివీడు ప్రజలకు ఏం కావాల్లో అడిగేందుకు వచ్చా. నా పర్యటనకు చెట్లు- కొట్టాల్సిన పని లేదు, షాపులు కట్టక్కర్లేదు, పరదాలు అవసరం లేదు. నా అజెండా అభివృద్ధి, సంక్షేమే.. పగలు ప్రతీకారాలు కాదని హోంమంత్రి అనిత చెప్పారు.



## తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు మరో నలుగురు కొత్త జడ్జిలు రానున్నారు. దేశవ్యాప్తంగా పలు హైకోర్టులకు సోమవారం 19మంది జడ్జీలు, అదనపు జడ్జీలు నియమితులయ్యారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. వీరి నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. కాగా, 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమించారు. గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ లు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. తెలంగాణతోపాటు- మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు, నలుగురు అదనపు జడ్జీలు.. ఇక, అస్సాం హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమితులయ్యారు.



2వ

## ఆత్మహత్యకు పాల్పడబోయిన యువకుడు

**మాటల్లో పెట్టి కాపాడిన హైడ్రా సిబ్బంది**

**అభినందించిన హైడ్రాకమిషనర్ రంగనాథ్**



## పాక్‌తో కాల్పుల విరమణలో మూడో వ్యక్తి లేదు

### ట్రంప్ జోక్యంపై పరోక్షంగా లోక్‌సభకు జైశంకర్ వివరణ

న్యూఢిల్లీ:భారత్-పాక్ మధ్య ఇటీవల జరిగిన కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం ఎంతమాత్రం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం ప్రత్యేక చర్చలో జైశంకర్ పాల్గొంటూ.. కాల్పుల విరమణకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వంపై వస్తున్న ఊహాగానాలను కొట్టివేశారు. ఏప్రిల్ 22- జూన్ 17 మధ్య ప్రధానమంత్రి మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ కాల్ సంభాషణలు జరగలేదని సభకు వివరించారు. భారత్-పాక్ మధ్య డైరెక్ట్ కమ్యూనికేషన్ అనంతరమే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చినట్లు- చెప్పారు. ఇందులో మూడో పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కాల్పులపై భారత్ విరుచుకుపడటంతో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నాంటూ పాక్ నుంచి భారత ప్రభుత్వానికి ఫోన్ కాల్స్ వచ్చాయని, అయితే ప్రొటోకాల్ ప్రకారం ఇలాంటి సమాచారం అధికారికంగా పాకిస్థాన్ డీజీఎంఓ నుంచి రావాలని ఇండియా పట్టు-పట్టిందని జైశంకర్ సభకు తెలిపారు. లష్కరే తొయిబా ప్రాక్సీ అయిన ది రెసిస్టెంట్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడం వెనుక భారత దౌత్యానికి క్రెడిట్ దక్కుతుందని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదానికి చిరకాలంగా పాకిస్థాన్ మద్దతిస్తున్న విషయాన్ని ఇండియా బలంగా ప్రపంచ దేశాల ముందుకు తీసుకువెళ్లిందన్నారు. ప్రపంచానికి పాకిస్థాన్ నిజస్వరూపం వెల్లడించడంలో సక్సెస్ అయ్యామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించేది లేదనే విధానాన్ని ఇండియా అనుసరిస్తోందన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై పోరు కేవలం ఆపరేషన్ సిందూర్‌కు పరిమితం కాదని, దేశ ప్రజలు, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పారు. జాతీయ భద్రతపై భారత్ దృఢ వైఖరి కొనసాగిస్తుందని, పాకిస్థాన్ జాతీయులకు వీసా ఆంక్షలు కొనసాగుతాయని వివరించారు. ఉగ్రవాదం ముప్పును ఎదుర్కొనేందుకు అనుసరిస్తు విస్తృత వ్యూహంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం

వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. సమస్యలపై చర్చించాలన్న ఆసక్తి అధికార విపక్షాలకు లేకుండా పోయింది. సభ ప్రారంభం కాగానే గోడవ చేయడం విపక్షాల వంతు అయితే వాయిదా వేయడం స్పీకర్ విధిగా మారింది. సోమవారం ఉద్యం కూడా ఇదే తరహాలో మధ్యాహ్ననికి సభ వాయిదా పడింది. దీనిబదులు సమస్యలు ముందుకు వేసుకుని ఏరోజు ఏది చర్చించాలన్నది నిర్ణయం తీసుకోవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమీ లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 21న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్దమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశం, ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం, నిరంకుశత్వం ప్రబలిపోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది



మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగు తోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది. ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు, నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు ప్రవేశ పెడుతున్న వాయిదా తీర్మానాలను సభాపతులు బుట్టదాఖలు చేస్తున్నారు. కనీసం సభావ్యవహారాల కమిటీ సమావేశాల్లో కూడా కీలక అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మనస్ఫూర్తిగా ముందుకు రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రధాని మోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. వారికి రూల్స్ కూడా తెలియకుండానే సమావేశాలు వాయిదా పడుతున్నాయి. ఈ తరహా జరుగుతున్న సమావేశాలతో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎక్కడుందన్న అనుమానం కలుగుతుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై వారం రోజులైనప్పటికీ ఒక్కరోజు కూడా పార్లమెంట్ సరిగ్గా సాగలేదు. వాయిదా తీర్మానాలతో విపక్షాలు ఆందోళన చేస్తున్నారు. స్పీకర్లు వాయిదాలు వేస్తున్నాయి. తాజాగా పార్లమెంట్ వ్యవహారాల పరిస్థితి ఇది. పార్లమెంట్‌ను నడిపించేందుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి..సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. ఇలా నిరంకుశంగా వెళితే ఎంతటి వారికైనా ప్రజలు శిక్ష వేయక మానరు. మళ్లీ మాదే అధికారం అన్న అహంకార ధోరణి పనికిరాదు. పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ అదేరీతిలో ప్రవర్తించి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. బిజెపి కూడా ఇదే ధోరణితో సాగితే ప్రజలు కూడా చాపచుట్టినట్లు చుట్టి బంగాళాఖాతంలో విసరేస్తారని గుర్తించాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి. వారు సమస్యలను ప్రస్తావిస్తే చర్చించాలి. చర్చల ద్వారా ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే చట్టసభలకు విలువ ఉంటుంది. గతంలో ఎప్పుడూ చర్చలకు ప్రాధాన్యం ఉండేది. సమస్యలపై తక్షణ చర్చలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలకు గౌరవం ఇనుమడించేలా అధికార విపక్షాలు కలిసి పనిచేయాలి. చట్టసభలను పాలకులే ఎక్కువగా గౌరవించాలి. ప్రజల సమస్యలపై చర్చించడం అలవాటు చేసుకోవాలి. ప్రజల సమస్యలపై చర్చించిన తరవాతనే విధాన నిర్ణయాలు తీసు కోవాలి. లేకుంటే ప్రజలు ఓ కంట కనిపెడుతుంటారని గుర్తించాలి. పార్లమెంటులో మంచి సంప్రదాయం నెలకొల్పేందుకు బిజెపి నేతలు ముందుకు రాకుంటే వారికి కూడా చరిత్రగుణ పాఠం చెప్పడం ఖాయం.

## 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు

శ్రీకాకుళం: ఆరుగాలం శ్రమించే రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయాలని దేశంలోనే తొలిసారిగా కూటమి ప్రభుత్వం 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్ ను ప్రారంభించి, డ్రోన్ పనితీరును పరిశీలించి, నందిగాం మండలం నరేంద్రపురం రైతులకు డ్రోన్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ సాగుకు సాంకేతికతను జోడిస్తే కూలీ ఖర్చులు, సమయం ఆదా అవుతుందని అన్నారు. ఒక ఎకరంలో పురుగుమందు పిచికారీ చేయడానికి డ్రోన్ కు ఏడు నిమిషాలు సమయం తీసుకుంటు-ందని చెప్పారు. అదే రైతు భుజాన వేసుకుని స్ప్రే చేయాలంటే రెండు గంటల సమయం తీసుకుంటు-ందని అన్నారు. ప్రతి ఒక్క రైతు కాలానుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. డ్రోన్ వాడకంతో సాగు ఖర్చు తగ్గి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. పంటల పెరుగుదల , తెగుళ్ల నియంత్రణను పర్యవేక్షించడంతోపాటు- దిగుబడి పెంచడానికి డ్రోన్ లు సహాయపడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా బ్రౌచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు త్రినాథ స్వామి, జగన్మోహనరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## పెట్టుబడులు రాకుండా అడ్డుకునే కుట్రలు

అమరావతి: ఏపీకి పెట్టుబడులు రాకుండా జగన్ అండ్ కో అడ్డుకుంటోందని.. పిల్ల సైకోల విష ప్రచారం శ్రుతి మించుతోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రముఖ కంపెనీలు గూగుల్, టీ-సీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు వస్తే.. వాటిపైనా దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్తును ఐదేళ్లు నాశనం చేసిన జగన్.. నేడూ అదే ధోరణిని అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్, సిలికాన్ స్కామ్, శాండ్ స్కామ్, ల్యాండ్ స్కాములు బయట పడటంతో వైకాపా నేతలు రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తూ పూర్తిగా అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వైకాపా నేతలు తమ కుంభకోణాల బాగోతాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. ఈసందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పల్లా శ్రీనివాసరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పిల్ల వైసీపీ సైకోల విష ప్రచారం స్మృతి మించుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి వచ్చే పెట్టుబడులను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. దెయ్యాల్లా మంచిని జీర్ణించుకోలేక గోల చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారడం లేదని దుయ్యబట్టారు. నీచ రాకీయాలు, అబద్ధాలతో వైషమ్యాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి రాక్షస మూకల, సైకో దెయ్యాల కోరలు పీకి పాతాళానికి తొక్కాలని హెచ్చరించారు. అప్పుడే ప్రజలకు మనశ్శాంతి.. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వికసిస్తుందని ఉద్ఘాటించారు. ఏపీలో జరుగుతున్న మంచిని చూసి జీర్ణించుకోలేక గోల చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టు-బడులు, పరిశ్రమలు రాబట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని నొక్కిచెప్పారు. సీఎం చంద్రబాబు విజన్ 2047 లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు పల్లా శ్రీనివాసరావు. గత ఐదేళ్లు గుడ్డులా పొదుగులో దాక్కున నేతలు అసలు అభివృద్ధి అంటే ఏంటో తెలియని నేతలు కూడా నేడు రాష్ట్ర అభివృద్ధిపై చీకటి రాజకీయం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకుండా... ఇవాళ ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, పిచ్చి పిచ్చి వాగుడు వాగుతున్నారని ధ్వజమెత్తారు. నాటి వైసీపీ పాలనలో 'ఇప్పుడే పెట్ట గుడ్డుపెట్టింది, పొదగడానికి సమయం పడుతుంది' అంటూ ఒక కోడిగుడ్డు నేత కామెంట్ చేసింది ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. అధికారం ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేయడం మరిచి.. నేడు పగిలిన గుడ్డు నుంచి వచ్చిన కోడి పిల్లలా మతిలేకుండా నోరు తెరుస్తున్నారని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు.

## విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం టెండర్లు

అమరావతి: విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. ఈపీసీ విధానంలో ఈ -టె-ండర్లను ఆహ్వానించింది. ఫేజ్-1లో 38.4 కి.మీ మేర రెండు కారిడార్లలో విజయవాడ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. కారిడార్-1లో నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం బస్టాండ్ వరకు.. కారిడార్-2లో బస్‌స్టేషన్ నుంచి పెనమలూరు వరకు మెట్రో నిర్మాణం జరగనుంది. కారిడార్-1లో 4.7 కి.మీ మేర డబుల్ డెక్కర్ ÷-లఫైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. 32 చోట్ల మెట్రో స్టేషన్లు, ఒక చోట అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ రానుంది. ఇప్పటికే విశాఖ మెట్రో రైలు టెండర్లను పిలిచిన విషయం తెలిసిందే.

## ప్రేమవ్యవహారంలో విషాదం అక్కను చంపిన తమ్ముడు

రంగారెడి::పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మందలించిన యువకుడు ఆ అమ్మాయికి తిరిగి ఫోన్ చేయడమే పాపమైంది. నలుగురిలో మన పరువు తీసినవాడు ఫోన్ ఎందుకు చేశాడని ఆగ్రహించిన తమ్ముడు అక్కను హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దేశాల రాఘవేందర్ మేస్త్రీ పనులు చేస్తూ కుటు-ంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే రాఘవేందర్ కుమార్తె రుచిత (21) అదే గ్రామానికి చెందిన ఈర్లపల్లి దినేష్ ప్రేమించింది.ఈ విషయమై పంచాయతీ పెట్టి ఇకపై అమ్మాయితో మాట్లాడవద్దని ఒప్పందం చేసుకున్నారు. అయితే రుచితకు దినేష్ ఫోన్ చేసి మాట్లాడుతుండగా గమనించిన ఆమె తమ్ముడు రోహిత్
మన పరువు తీసినవాడితో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు-చేసుకుంది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన తమ్ముడు అక్క రుచితను చంపి ఉంటాడని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పారిశుధ్య పనులకు పెద్దపీట సీజనల్ వ్యాధుల నివారణ ముఖ్యం

విజయవాడ: ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. ప్రజల నిర్లక్ష్యం కారణంగా పట్టణ్యాల్లోపారిశుద్యం కరువయ్యింది. చెత్త అవతల పడేస్తే అయిపోతందన్న భవనలో ప్రజలు ఉన్నారు. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల అంటువ్యాధులు ప్రజలను తీవ్రంగా భయపెట్టాయి. వర్షాకాలంలో బురదతో పాటు, మంచినీట సమస్య ప్రజలను వెన్నాడుతోంది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని
తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది.

## రాజకీయ నిరంకుశం ప్రమాదం

**అధికారంలో ఉన్నప్పడే జాగ్రత్తలు అవసరం**

న్యూఢిల్లీ: అధికారం శాశ్వతమని ఏ రాజకీయ పార్టీ అయినా అనుకుంటే పొరపాటు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టికరచి పోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ఎన్టీఆర్ లాంటి వారు కూడా ప్రజాగ్రహంలో కొట్టుకు పోయారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అడ్రస్ లేకుండా పోయారు. ప్రజలు ఛీదరించుకుంటే ఎంతటి వారైనా మట్టి కరవాల్సిందే. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివృద్దిని పక్కన పెట్టి బుజ్జగింపురాజకీయాలను చేస్తున్నారు. తెలంగాణలో ఇలాగే ఓటమికి ఓ రకంగా అది కెసిఆర్ వైఫల్యంగానే చూడాలి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడనేవాడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించాలి. అప్పుల కుప్ప చేసి పథకాలను ప్రకటించి ప్రజలను ఓట్ల రూపంలో మలచుకోవడంలో అధికార పార్టీ నేతలు ఆరితేరారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఈ అప్పులు
ఇప్పుడు తీర్చే శక్తి కూడా రాష్ట్రాలకు లేకుండా పోతున్నది. అందుకే ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కెసిఆర్ జగన్ ఇద్దరూ తమ ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగుతూ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారు. అప్పులతో రాష్ట్రాలను కోలుకోకుండ చేశారు. అధికారంలో ఉన్నవారు అన్నింటికీ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు మంచిది కాదు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో నేతలు విఫలమవుతున్నారు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడుపుతున్నారు. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉంటే జరిగే అనర్థాలకు జగన్, కెసిఆర్‌లు ప్రత్యక్ష ఉదాహరణలు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్, జగన్‌లు చిన్నపాటి విమర్శలను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. ఫలితంగా ప్రజల మనోభావాలను తెలియ జేయడానికి పార్టీలో కూడా ఎవరూ సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వీరిద్దరూ ఇప్పుడు ప్రతిపక్షానికి కూడా పనికి రాకుంఆ పోతున్నారు.

## ఆత్మహత్యకు పాల్పడబోయిన యువకుడు

హైదరాబాద్: దుర్గంచెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని చాకచక్యంగా కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది తిరుపతియాదవ్, సంతోష్‌చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. ఈ నెల 25న రామిరెడ్డి అనే యువకుడు దుర్గంచెరువు తీగల వంతెన అంచున నిలబడి చెరువులోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. అక్కడే విధుల్లో ఉన్న డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడింది. రామిరెడ్డిని మాటల్లోపెట్టి.., దృష్టి మరల్చి.. క్షణాల్లో కాపాడిన తిరుపతి యాదవ్‌ను కమిషనర్ అభినందించారు. అక్కడే విధుల్లో ఉండి.. యువకుడిని కాపాడేందుకు సహకరించిన సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను కూడా శాలువ కప్పి సన్మానించారు. దుర్గం చెరువు వంతెనపై వీరు నిలుచుండగా.. రంధ్రాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఓ యువకుడు దూకేందుకు యత్నిస్తున్న దృశ్యాలను చూశామని.. ఒకవైపు అతిడిని దూకకుండా మాటల్లో పెట్టి... మరో వైపునుంచి వచ్చి కాపాడినట్టు- ఆ ముగ్గురు డీఆర్ ఎఫ్ ఉద్యోగులు కమిషనర్‌కు వివరించారు.

# నిండుకుండలా సాగర్ జలాశయం

నల్గొండ: ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో సోమవారం నాగార్జున సాగర్ డ్యాం నిండుకుండను తలపిస్తుంది. శ్రీశైల ప్రాజెక్టు నుంచి 93,127 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతున్నది. ఇప్పటికే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతోపాటు- ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండటంతో క్రస్టు గేట్లను ఎత్తడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మంగళవారం ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తే అవకాశం ఉన్నట్లు- తెలుస్తుంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 583.8 అడుగులుగా ఉంది. ప్రాజెక్టులో గరిష్ఠంగా 312.05 టీ-ఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 293.97 టీ-ఎంసీల నీరు ఉన్నది. మరో 18 టీ-ఎంసీల నీరు వస్తే నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుతుంది. ఇక శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతున్నది. ప్రస్తుతం రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



# వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి

**భారత మాజీ ఉప రాష్ట్రపతి గౌ౹౹ శ్రీ వెంకయ్య నాయుడు**

**తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, జూలై 28.**



సామాన్య భక్తుల సౌలభ్యం కోసం వీఐపీలు ఏడాదికి ఒకసారి మాత్రమే తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి గౌ౹౹ శ్రీ వెంకయ్య నాయుడు సూచించారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అదనపు ఈవో శ్రీ వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో స్వామివారి దర్శనానికి ఉండే స్థలం, సమయం పరిమితంగా ఉండటంతో బయట ఎంత మంచి ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తుల రద్దీ కారణంగా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే పరిమిత సంఖ్యలో కుటుంబ సభ్యులను తీసుకువస్తే దేవస్థానం నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులందరూ భాద్యతతో హుందాగా ఈ సూచనను పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, పేష్కార్ శ్రీ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 260 అర్జీలు

### పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఆర్జీలకు మొదటి ప్రాధాన్యతతో పరిష్కారం చూపాలి

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జి ఆర్ ఎస్ ) ద్వారా ప్రజల నుండి అందే ప్రతి అర్జీలకు నాణ్యతగా గడువు లోపు పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్.



**లితిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,జూలై 28 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పదంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయమునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, వైద్య ఆరోగ్య శాఖ వారిచే వైద్య శిబిరం, త్రాగునీటి సౌకర్యం, సూదుర ప్రాంతాల నుండి వచ్చు వారికి టి, కాఫీ ఏర్పాటు చేసి వచ్చిన అర్జీదారులకు అందించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్ధవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్,సుధా రాణి, రోజ్ మా%శీ%డ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదు చేసి అర్జీదారులకు రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు :

రెవెన్యూ-125, పంచాయతీ రాజ్ -27, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -13, సివిల్ సప్లైస్ -6, పోలీస్ శాఖ - 8,సర్వే ల్యాండ్ రికార్డ్స్- 12,విద్యుత్ శాఖ- 4, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ -1, స్కూల్ ఎడ్యుకేషన్ -27, %ఖుజూంషతీవఱం%- 14, హయ్యర్ ఎడ్యుకేషన్ - 1, ఫ్యామిలీ వెల్ఫేర్ - 3, ఏపీఎస్ఆర్టీసీ - 2, రూరల్ డెవలప్మెంట్ - 3, జి ఎస్ డబ్ల్యూ ఎస్ - 1, సెకండరీ హెల్త్ - 1, ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్మెంట్ - 1, పబ్లిక్ హెల్త్ - 1, ఫారెస్ట్ - 1, రూరల్ పావర్టీ - 5, వాటర్ రిసోర్సెస్ - 4, మొత్తం 260 అర్జీలు రావడం జరిగిందని సంబంధిత అధికారులు వచ్చిన అర్జీల పై దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు : టీటీడీ జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, జూలై 28**





తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 8న నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్టు టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని ఆస్థానమండపంలో సోమవారం జేఈవో వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి కుంకుమ, గాజులు, ప్రసాదాలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 8వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థానమండపంలో వరలక్ష్మీ వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వర్ణరథంపై శ్రీ పద్మావతి అమ్మవారు నాలుగు మాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. వరలక్ష్మీ వ్రతంలో భక్తులు(ఇద్దరు) రూ. 1000/- చెల్లించి పాల్గొనవచ్చున్నారు. ఈ కారణంగా అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, ఊంజల్‌సేవలను టీటీడీ రద్దు చేసినట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మహిళా భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని జేఈవో అధికారులకు సూచించారు. వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేయాలని, భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు విరివిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆకట్టుకునేలా భజన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, ఇతర ప్రాంతాల్లో మరింత ఆకర్షణీయంగా, ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేపట్టాలని సూచించారు. స్థానిక పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని ఆలయ పరిసర రహదారులు, సమీప ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్, సెక్యూరిటీ సమస్యలు తలెత్తకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారాలు అందించేందుకు వీలుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్థానమండపంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూ లైన్లు, ఆలయ పరిసరాలలో పెండాల్స్, సూచిక బోర్డులు, ఎల్.ఈ.డీ స్క్రీన్ లు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన శ్రీవారి సేవకులు, పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులను సమకూర్చుకోవాలన్నారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో ముందస్తుగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

**పురాణ ప్రాశస్త్యం :** పూర్వం శంకరుడు పార్వతిదేవికి ఈ వరలక్ష్మీ వ్రతం విశిష్ఠత, అచరించవలసిన విధానాన్ని తెలియచేసినట్లు స్కంద, భవిష్యోత్తర పురాణాల ద్వారా తెలుస్తుంది. కావున సాక్షత్తు శ్రీ మహాలక్ష్మీ అవతరించిన దివ్యస్థలం తిరుచానూరు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీ. శ్రవణ మాసంలో ఈ వ్రతం చేసిన మహిళలకు సత్సంతానం, దీర్ఘమాంగల్యసౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబసౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని పురాణాల ద్వారా తెలుస్తుందని అర్చకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీ శ్రీనివాస చార్యులు, శ్రీ బాబు స్వామి, శ్రీ మణికంఠ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ పి. హరింద్రనాథ్, ఎస్.ఈ (ఎలక్ట్రికల్) శ్రీ వేంకటేశ్వర్లు, అన్నదానం డిప్యూటీ ఈవో శ్రీ సెల్వం, విజీవో శ్రీ సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓ వినతి పత్రం



**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 28**

ప్రతి సోమవారం సి.బెళగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించి పిజిఆర్ఎస్ లోని దరఖాస్తులను నిర్ణిత సమయంలో పరిష్కరిస్తామని ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. సోమవారం నిర్వహించిన పిజి ఆర్ఎస్ కు రెండు దరఖాస్తులు వచ్చాయని వాటిలో జల జీవన్ మిషన్ కింద సి.బెళగల్ గ్రామంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని మసీదు వెనక ఉన్న వీధి ప్రజలకు త్రాగునీటి సమస్య తీర్చాలని , మరొకటి బ్రాహ్మణ దొడ్డి సచివాలయ పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీ అయినా మారందొడ్డిలో సచివాలయ ఉద్యోగస్తులు విధులు నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని మారందొడ్డి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అలాగే పోలకల్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులు తమకు ఆరు నెలల జీతాలు పెండింగ్లో ఉన్నాయని తక్షణమే జీతాలు విడుదల చేయాలని డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ రామన్న, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 28**

సి.బెళగల్ మండల వ్యాప్తంగా సోమవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రావణ మాస చవితి సందర్భంగా ఉదయం నుంచి మహిళలు నాగుల కట్టలకు చేరుకొని నాగుల విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతలకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా నూతన వధూవరులు పుట్టలకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సి.బెళగల్ గ్రామంలోని వాల్మీకి రామాలయం లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి నైవేద్యం సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు.

# ఆఫీస్ సబార్డినేట్ శాలుమియా మృతి

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 28**



సి.బెళగల్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయం నందు ఆఫీస్ సబ్ ఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తున్న శాలుమియా(47) సోమవారం మధ్యాహ్నం మరణించారు. సోమవారం ఉదయం నుంచి హైబీపీ తో బాధపడుతున్న శాలుమియా ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ హాస్పిటల్కు తరలించారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మరణించినట్టు కుమారుడు వలి తెలిపారు. మృతునికి భార్య జైథూన్ భీ, కుమారుడు వలి, కుమార్తె ఉన్నారు. శాలమియా తహసిల్దార్ కార్యాలయంలో సుమారు 13 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, కార్యాలయంలో చాలా చురుగ్గా పనిచేసేవాడని తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. అనంతరం శాల్మియా మృతి పట్ల రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

# ఆర్టీసీ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించరాదు..!

### -ఆర్టీసీ డిపో మేనేజర్ పోస్టర్ ఆవిష్కరణ.

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జులై 28 -:**



ఆర్టీసీ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించరాదని నందికొట్కూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజ్ తెలిపారు . సోమవారం స్థానిక బస్టాండ్ డిపోలో డ్యూటీలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించిన దాడికి యత్నించిన, విధులకు ఆటంకం కలిగించిన అటువంటి వారిపై చట్టపరంగా ఏ సెక్షన్లు విధించబడే వాల్ పోస్టర్ ను నందికొట్కూరు డిపో మేనేజర్ నాగరాజు ఆవిష్కరించారు . ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో డ్యూటీలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దుర్భాషలాడడం, విధులకు ఆటంకం కలిగించడం పరిపాటిగా మారిందని, విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన సెక్షన్లు నమోదు చేసి ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కల్పించడం, ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు.



ఉత్తేజిత దినపత్రిక

# కేంద్రం కానుక.. 14 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా క్యాన్సర్ కేంద్రాలను విస్తరించేందుకు నిర్ణయించుకున్న కేంద్ర ప్రభుత్వం .. ఏపీకి శుభవార్త చెప్పింది.

కేంద్ర ప్రభుత్వం క్యాన్సర్ రోగుల కోసం ఒక కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతోంది. దీనిలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 200కు పైగా కొత్త క్యాన్సర్ డే కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఏపీ: దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 నాటికి దేశవ్యాప్తంగా 200కు పైగా డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 14 కేంద్రాలను కేటాయించింది. అనంతపురం, కర్నూలు, కృష్ణా, విజయనగరం వంటి జిల్లాల్లో ఈ కేంద్రాలు రానున్నాయి. వీటి ద్వారా క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి తెలిపారు.

ప్రస్తుతం మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారుల్లో క్యాన్సర్ ముందు వరుసలో ఉంటుంది. ప్రతి ఏటా వేల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ మహమ్మారి గురించి సరైన అవగాహన లేక.. తొలి దశలోనే గుర్తించకపోవడంతో.. చాలామంది క్యాన్సర్ బాధితులు ప్రాణం పోగొట్టుకుంటున్నారు. నేటికి కూడా మన దేశంలో క్యాన్సర్‌కు సరైన ట్రీట్‌మెంట్ లభించడం లేదు. ధనవంతులైతే విదేశాలకు వెళ్లి క్యాన్సర్ చికిత్స పొందుతుంటారు. ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా క్యాన్సర్ కేంద్రాలను విస్తరించేందుకు నిర్ణయించుకున్న కేంద్ర ప్రభుత్వం .. ఏపీకి శుభవార్త చెప్పింది.

కేంద్ర ప్రభుత్వం క్యాన్సర్ రోగుల కోసం ఒక కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతోంది. దీనిలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 200కు పైగా కొత్త క్యాన్సర్ డే కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ 200 కేంద్రాల్లో.. 14 డే కేర్



క్యాన్సర్ కేంద్రాలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ లోక్‌సభ వేదికగా ప్రకటించారు. వీటి ద్వారా క్యాన్సర్ రోగులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఈ 14 డే కేర్ కేంద్రాలు రానున్నాయి. అనంతపురం, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, బాపట్ల, కర్నూలు, కాకినాడ, కృష్ణా, ప్రకాశం, పల్నాడు, తూర్పుగోదావరి, నంద్యాల, విజయనగరం, ఎన్టీఆర్ జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, ఎన్‌హెచ్‌ఎం కింద ఇప్పటి వరకు దేశంలోని 10.18 కోట్ల మంది మహిళలకు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామని.. ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలానే వైద్య విద్యను మెరుగుపరచడానికి కూడా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. పీఎంఎస్‌ఎస్‌వై పథకం కింద 19 ఎయిమ్స్‌లలో యూజీ కోర్సులు ప్రారంభించారు. అంతేకాకుండా, ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో యూజీ, పీజీ సీట్ల సంఖ్యను కూడా పెంచారు. అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు 51,348 నుంచి 1,15,900కు పెరిగాయి. అలానే పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు 31,185 నుంచి 74,306కు పెరిగాయని తెలిపారు. అలానే 'ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన' పథకం కింద ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 41 కోట్ల ఆయుష్మాన్ కార్డులను సృష్టించామని ప్రతాపరావు జాదవ్ తెలిపారు.

# ఇకపై వాట్సాప్‌కే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

ఏపీ: రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. ఇకపై ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే, కొనుగోలుదారులకు ఒరిజినల్ డాక్యుమెంట్ కాపీ నేరుగా వాట్సాప్‌లో అందుతుంది. విశాఖపట్నంలో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలుదారు మొబైల్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆధార్‌తో సరిపోల్చిన తర్వాత, డాక్యుమెంట్ వాట్సాప్‌కు పంపబడుతుంది. ఈ విధానం పారదర్శకతను పెంచుతుందని అధికారులు భావిస్తున్నారు. అసలు డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయోమెట్రిక్ ద్వారా పొందవచ్చు. ఆ వివరాలు..

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటుంది. దీనిలో భాగంగానే రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్.. వాట్సాప్ ద్వారానే బర్త్, డెత్ సర్టిఫికెట్లు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఏపీలో వాట్సాప్ ద్వారానే సుమారు 300 సేవలు ప్రజలకు అందుతున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖ .. ఇప్పుడు వాట్సాప్‌లో సేవలు అందించేందుకు ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ఇకపై ఏదైనా ఆస్తిని రిజిస్టర్ చేసినప్పుడు అందుకు సంబంధించిన ఒరిజనల్ డాక్యుమెంట్ నేరుగా కొనుగోలుదారుడి మొబైల్ వాట్సాప్ నంబరుకు పంపించేలా ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖ తాజా నిర్ణయం ప్రక్రియ ఇకపై ఏదైనా ఆస్తిని రిజిస్టర్ చేస్తే.. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఒరిజనల్ డాక్యుమెంట్ కాపీని.. కొనుగోలుదారుడి వాట్సాప్ నంబరుకి పంపేలా ఏర్పాటు చేశారు. ఈ సర్వీసు శుక్రవారం నుంచి విశాఖపట్నం జిల్లాలో అందుబాటులోకి వచ్చింది.

ఇంతకు ముందు వరకు కూడా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో.. రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌ని.. డాక్యుమెంట్ రైటర్లే సాయంత్ర వేళ తీసుకుని.. ఆ తర్వాత వారికి వీలు కుదిరినప్పుడు తీరిగ్గా కొనుగోలు దారులకు అందిస్తుండేవారు. ఇందుకోసం గతంలో రిజిస్ట్రేషన్ సమయంలో నామినీ పేరు ఎంటర్ చేయించేవారు. అయితే ఇప్పుడు రిజిస్ట్రేషన్ల శాఖ కొత్తగా కార్డ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. దీని వల్ల కొనుగోలు దారుడు.. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కాపీని.. తన మొబైల్ వాట్సాప్ ద్వారా వెంటనే పొందే అవకాశం కలగనుంది. ఇందుకోసం ఇప్పుడు రిజిస్ట్రేషన్ సమయంలో.. ఆస్తి కొనుగోలుదారు మొబైల్ నంబర్ ఇవ్వవాని అడుగుతున్నారు. దీని వల్ల రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే డాక్యుమెంట్ వాట్సాప్‌లో పంపే అవకాశం లభిస్తుంది. ఈ కొత్త విధానం రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకతను పెంచడానికి దోహదం చేస్తుందని అధికారులు ఆశిస్తున్నారు. ఇక రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి కొనుగోలుదారు మొబైల్ నెంబర్ ఇవ్వాలి. ఆ నంబర్‌ను ఆధార్‌తో సరి పోల్చి చూస్తారు. సేమ్ అని తెలిశాక.. రిజిస్ట్రేషన్ అయిపోయిన తర్వాత, డాక్యుమెంట్ డిజిటల్‌గా స్కాన్ చేస్తారు. వెంటనే ఆ డాక్యుమెంట్ కాపీని రిజిస్ట్రేషన్ సమయంలో ఎంటర్ చేసిన వాట్సాప్ నంబరుకు సెండ్ చేస్తారు. దీంతో కొనుగోలు దారుడు దానిని మొబైల్‌లో చూసుకోవచ్చు. ఆ తర్వాత, కొనుగోలుదారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేసి అసలు డాక్యుమెంట్ తీసుకోవాలి. ఇంతకు ముందులా డాక్యుమెంట్‌ను రైటర్లకు ఇవ్వరు. నేరుగా వాట్సాప్‌కి.. ఆ తర్వాత కొనుగోలుదారు వెళ్లి తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ఈ కొత్త అప్‌డేట్ గురించి విశాఖపట్నం రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకత పెంచాలనే ఉద్దేశంతోనే ఈ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చాము. దీనివల్ల ఎవరి డాక్యుమెంట్ వారికే అందుతుంది. అలానే ఒకరి డాక్యుమెంట్‌ను మరొకరు చూసేందుకు అవకాశం ఉండదు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో వాడుకలో ఉన్న కరెక్ట్ మొబైల్ నంబరు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

# సుపరిపాలన లో ఎమ్మెల్యేకు బ్రహ్మరథం

**రాష్ట్రంలో త్రీబుల్ ఇంజన్ సర్కారు**

**కూటమి పాలనలో అభివృద్ధికి పెద్ద పీట**

**ఎమ్మెల్యే గిత్త జయసూర్య.**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జూలై 28 :**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన"సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా సోమవారం పగిడ్యాల మండలం ఆంజనేయ నగర్ గ్రామంలో టీడీపీ నాయకులు వవిజయ్ కుమార్, బీరవోలు గ్రామంలో టీడీపీ నాయకులు హనుమన్న, స్వాములు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గత ఐదేళ్లుగా గ్రామాలు అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా అరాచక ప్రభుత్వం పక్కదారి పట్టించిదని, స్థానిక సంస్థలకు విలువలేకుండ చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించడంతోపాటుగా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, టీడీపీ నాయకులు పుల్యాల శ్రీనివాస రెడ్డి, ఒగిలి శ్రీనివాసులు, పలుచాని మహేష్ రెడ్డి, రవికుమార్, నరసింహా, పుల్లన్న, తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ , మండల వ్యవసాయ అధికారి మురళీధర్, ఏపీయం చంద్రకళ, ఏపీఓ మద్దిలేటి, సాంకేతిక సహాయకులు జ్యోతి, ప్రభుత్వ అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







# ఆటోడ్రైవర్లకు శుభవార్త.. అకౌంట్లోకి డబ్బులు..

ఏపీ: ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించనుంది. అయితే అదే రోజున ఆటోడ్రైవర్లకు కూడా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు. ఐదు రకాల బస్సులలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని.. అలాగే ఆటోడ్రైవర్లకు కూడా అదేరోజు ఆర్థిక సాయం అందిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు.

ఏపీలోని ఆటోడ్రైవర్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది. ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించనుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించే ఆగస్ట్ 15వ తేదీన ఆటోడ్రైవర్లకు కూడా ఆర్థిక సాయం అందించనుంది. ఈ విషయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. తమ ఉపాధి దెబ్బతినే అవకాశం ఉందని ఆటోడ్రైవర్ల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. పొరుగున ఉన్న తెలంగాణలోనూ ఇదే విషయమై ఆటోడ్రైవర్ల నుంచి అసంతృప్తి, ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఏపీ ప్రభుత్వం ఇలాంటి ఇబ్బందులు రాకుండా.. మహిళలకు ఫ్రీ బస్ జర్నీ అమలు చేయనున్న ఆగస్ట్ 15వ రోజునే ఆటోడ్రైవర్లకు కూడా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు సమాచారం.

మరోవైపు తెలంగాణలో మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ వ్యాప్తంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పిస్తున్నారు. అయితే మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా తమ ఉపాధి దెబ్బతిందని, ఆటోలు ఎక్కేవారు లేకుండా పోయారని ఆటోడ్రైవర్లు వాపోతున్నారు. ఆటో నడుపుతూ నాలుగు రాళ్లు వెనకేసుకునే తమకు.. గిరాకీలు పడిపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం ముందు చూపుతో.. ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఏపీలోనూ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయనున్నారు. ఐదు రకాల బస్సు సర్వీసులలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# దుర్గగుడిలో సేవ ఇకపై ఆన్‌లైన్‌లోనే



విజయవాడ: తిరుమల తరహాలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలోనూ భక్తులకు సేవా చేసే అవకాశం కల్పించారు. అమ్మవారి సేవలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న భక్తులు దేవస్థానం వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి ఉచిత వసతి, భోజనంతో పాటు అమ్మవారి దర్శనం కూడా కల్పిస్తారు. రోజుకు 200 మందికి ఈ సేవలో పాల్గొనే అవకాశం ఉంటుంది. భక్తులకు సహాయం చేయాలనుకునే వారికి ఇది ఒక మంచి అవకాశం. చాలా మంది భక్తులు.. తిరుమల శ్రీవారి ఆలయం సేవ చేయడానికి తరలి వస్తుంటారు. ఇప్పటి వరకు కేవలం తిరుపతిలోనే ఉన్న ఈ సౌకర్యాన్ని ఇకపై విజయవాడ దుర్గమ్మ ఆలయంలో కూడా ప్రవేశ పెట్టనున్నారు. ఈక్రమంలో ఆలయ అధికారులు దుర్గమ్మకు సేవ చేయాలని భావించే భక్తులు, సేవా బృందాలకు అవకాశం కల్పించారు. దుర్గమ్మకు సేవా చేయాలని ఆసక్తి ఉన్న భక్తులు దరఖాస్తు చేసుకోవడం కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించారు.

# ఆ ప్రాంతాన్ని విశాఖలో కలపాలని డిమాండ్

ఆంధ్రప్రదేశ్: రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన చర్చ మళ్ళీ మొదలైంది. శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో కలపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నారు. విశాఖలో కలిస్తే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. త్వరలో భోగాపురం విమానాశ్రయం రానుండటంతో విశాఖలో విలీనం కోసం ప్రజలు పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ వెనక కారణాలు ఏంటి అనే వివరాల కోసం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. గ్రామాల సరిహద్దులు, మండలాలు, డివిజన్లు, జిల్లాల పేర్ల మార్పు అంశంపై గత కొంతకాలంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తుండటంతో.. వీటిని పరిశీలించడానికి ప్రభుత్వం తాజాగా ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో ఏడుగురు మంత్రులు సభ్యులుగా ఉన్నారు. పరిపాలనా సౌలభ్యం, ప్రాంతాల మధ్య ఆర్థిక, సామాజిక సమతుల్యతను పెంచేలా జిల్లాల పునర్విభజన జరగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉపసంఘం ఏర్పాటుతో పాత డిమాండ్ మరో సారి తెర మీదకు వచ్చింది. తమ ప్రాంతాన్ని విశాఖలో విలీనం చేయాల్సిందిగా ఆ ప్రాంత జనాలు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తేజిత దినపత్రిక


# దూరం తగ్గి దగ్గరైపోతారు..





భార్యభర్తల మధ్య అవగాహన, సాన్నిహిత్యం అనేది చాలా మంచిది. సాన్నిహిత్యం అంటే కేవలం శారీరకంగానే కాదు చాలా విషయంలో కూడా ఉంటుంది. అవేంటో తెలుసుకోండి. కపుల్స్ మధ్య శారీరక సాన్నిహిత్యం మాత్రమే ఉంటుందనుకుంటే పొరబాటే. ఇతర కారణాలు కూడా వారిని ఒక్కటిగా చేస్తాయి. వారి మనసులని కలుపుతాయి. అవేంటో.. పూర్తి వివరాలు తెలుసుకోండి. విజ్ఞాన సంబంధమైనవి.. ఇటీవలి కాలంలో యూత్‌లో మేధో సాన్నిహిత్యం పెరుగుతుందని చెప్పొచ్చు. ఈ విధంగా తెలివితేటలతో వ్యవహరించినప్పుడు అవి వేటికి సంబంధించినా ఇద్దరు ఒకరితో మరొకరు డిస్కస్ చేయడంతో వారి మధ్య ఓ అవగాహన కుదిరి దగ్గరవుతారు. నేర్చుకోవడం.. ఆడవారు, మగవారు ఇద్దరూ కూడా కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. ఇది ఇద్దరినీ దగ్గర చేయడంలో హెల్ప్ చేస్తుంది. ఇద్దరికీ కొత్త ప్లేసెస్‌కి వెళ్లడం, కొన్ని డేర్ స్టెప్స్ చేయడానికి కార్యకలాపాలు ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఆ ప్రయత్నంలో వారు చాలా క్లోజ్ అవుతారు. ఎంజాయ్ చేయడం.. రిలేషన్ షిప్ విషయంలో వినోదం, సాహసాలు చేయడంలో కూడా దంపతులు ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఇలాంటి పనులు చేయడం వల్ల కూడా వారి మధ్య అనుబంధం పెరుగుతుంది. కాబట్టి, ఇద్దరు కలిసి హ్యాపీ టైమ్ ఎంజాయ్ చేయొచ్చు. క్రియేటివిటీ.. క్రియేటివిటీ కూడా మనసులని, మనుషులని దగ్గర చేయడంలో హెల్ప్ చేస్తుంది. అందుకే భార్యాభర్తలు ఇద్దరు కలిసి ఈ పనులు చేయొచ్చు. ఇద్దరు కలిసి పెయింట్స్ వేయడం, బొమ్మలు గీయడం, మ్యూజిక్ ఇలా ఏదైనా ఇష్టమైన హాబీతో ఇద్దరు ఏకమవుతారు. సో.. దగ్గరవ్వాలని భావించే కపుల్స్ వీటిన్నింటిని ఫాలో అయి మీ రిలేషన్‌ని మరింత స్ట్రాంగ్ చేయొచ్చు.

# మీ ఆయుష్షును పెంచే.. హిమాలయ ఔషధాలు

హిమాలయాలు.. భూతల స్వర్గం. వెండికొండల్లా కన్పించే హిమాలయాల్ని ఎంతసేపు చూసినా తనివి తీరదు ప్రకృతి ప్రేమికులకు. ఆ కొండల నడుమ కొలువైన మంచులింగాన్ని కళ్లారా చూడాలనో, మానస సరోవరాన్ని సందర్శించాలనో కలలు కంటుంటారు కోట్లమంది. హిమాలయాలు.. ప్రకృతి ధామమే కాదు.. ఔషధ మూలికల ఆలవాలం. శతాబ్దాలుగా, స్థానిక కమ్యూనిటీలు ఈ మూలికలపై ఆధారపడి ఉన్నాయి. ఈ మూలికలు.. అనారోగ్యాల చికిత్సకు ఉపయోగపడటమే కాదు.. మన ఆయుష్షును పెంచే శక్తి ఈ మూలికలకు ఉంది. మన ఆరోగ్యాన్ని రక్షించి, దీర్ఘాయువును ప్రసాధించే మూలికలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

అశ్వగంధ.. భారతీయ జిన్‌సెంగ్‌గా పిలిచే అశ్వగంధను వేల సంవత్సరాల నుంచీ ఆయుర్వేదంలో వాడుతున్నారు. హార్మోన్ల అసమతౌల్యంతో తలెత్తే మధుమేహ సమస్యల్నీ ఇది నిరోధిస్తుంది. కాబట్టి పీసీఓడీ, ఇతరత్రా నెలసరి సమస్యలతో బాధపడేవాళ్లకి ఇది ఎంతో మేలు చేస్తుంది. అశ్వగంధ వల్ల ఆందోళన, ఒత్తిడి వంటివి తగ్గుతాయనీ తద్వారా ఫుడ్ క్రేవింగ్ కూడా తగ్గడంతో బరువు అదుపులో ఉంటుందనీ తాజా పరిశోధనలూ చెబుతున్నాయి. నిద్రలేమినీ కీళ్లనొప్పుల్నీ తగ్గించే గుణం కూడా దీనికి ఉంది. శతావరిని ఆస్పరాగస్ అనీ అంటారు. దీనిలో ఎ, సి, కె, బి6 విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. క్రోమియం అనే ఖనిజం రక్తంలో చక్కెర స్థాయులు పెరగకుండా అడ్డుకుంటుంది. రుటిన్ అనే పదార్థం పేగులకు మంచి చేస్తుంది. అండాల్లో ఈస్ట్రోజెన్ ఉత్పత్తికి సాయంచేస్తుంది. పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. తల్లి పాలివ్వడంలో ముఖ్యమైన ప్రొలాక్టిన్ ఉత్పత్తిని పెంచడానికి ఇది సహాయపడుతుంది. శతావరి పొడిని తేనె, పాలతే కలిపి తీసుకోవచ్చు.



గుగ్గిలం.. గుగ్గల్ అనేది ముకుల్ మిర్రర్ చెట్టు నుంచి వచ్చే.. జగురు పదార్థం. దీనిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటా యి. ఇది కొలెస్ట్రాల్ కరిగిం చడానికి ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. మీరు ఉదయాన్నే గోరువెచ్చని నీటితో పావు స్పూన్ గుగ్గిలం వేసుకుని తాగితే మేలు జరుగుతుంది.

శిలాజిత్.. షిలాజిత్ అనేది హిమాలయ పర్వతాలలో కనిపించే ఒక జిగట రెసిన్. దీనిలో మినరల్స్, ఫుల్విక్ యాసిడ్ ఉంటుంది. ఇది శక్తి స్థాయిలను పెంచుతుందని, రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది, దీర్ఘాయువును ప్రోత్సహిస్తుందని నమ్ముతారు. శిలాజిత్ నీటిలో వేసుకుని తాగొచ్చు.

బ్రహ్మి.. బ్రహ్మి.. అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తుంది. మెదడు పనితీరును ప్రోత్సహిస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. తద్వారా దీర్ఘాయువును ప్రసాదిస్తుంది. గోరువెచ్చని నీటిలో బ్రాహ్మి ఆకుల కషాయాలను తయారు చేసి ఉదయం పూట త్రాగాలి. తులసి..



తులసి ఆకుల్ని నోట్లో వేసుకొని నమలటం వల్ల జలుబు, ఫ్లూలు దరిచేరవు. ఇవి శరీరంలో చక్కెర స్థాయిల్ని తగ్గించగలవు. తులసి ఆకులు తరచు తీసుకుంటే.. హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంటుంది. తులసి ఆకులకు శరీరంలో కొవ్వు పెరగకుండా అడ్డుకునే శక్తి ఉంది. తరచూ ఈ ఆకుల్ని మజ్జిగలో కలిపి తాగుతుంటే.. బరువు తగ్గుతారు.

తిప్పతీగ.. తిప్పతీగను.. గిలోయ్ అనీ అంటారు. అంటే– వృద్ధాప్యాన్ని నిరోధించే అమృతం అని అర్థమట. ఈ మొక్క కాండంలోని ఫైటోకెమికల్స్ ఇన్‌ఫ్లమేషన్‌ను అడ్డుకుంటాయనీ తద్వారా కీళ్లవాపుల్ని నివారిస్తాయనీ అధ్యయనాలు పేర్కొన్నాయి. గోరువెచ్చని పాలల్లో పావు లేదా అరటీస్పూను తిప్పతీగ పొడి వేసుకుని తాగితే కీళ్లనొప్పులు తగ్గుతాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు శరీరంలోని మలినాలను తొలగించి మూత్రపిండాలు పాడవకుండా చేస్తాయి.









# చుండ్రు సమస్య దూరం అవుతుంది..!

శీతాకాలం చుండ్రు సమస్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా శీతాకాలంలో జుట్టు విషయంలో ఎక్కువగా వేధించే సమస్య చుండ్రు. శీతాకాలం చలిగాలుల కారణంగా.. చర్మం మాదిరిగానే కుదుళ్ల భాగం కూడా పొడిగా తయారవుతుంది. దీంతో చుండ్రు సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. దీని కారణంగా జుట్టు రాలిపోవడం మాత్రమే కాదు తలలో దురద, ముఖంపై చిన్న చిన్న మొటిమలు కూడా వస్తుంటాయి. చలికాలం వేధించే.. చుండ్రు సమస్యకు చెక్ పెట్టడానికి కొన్ని హెయిర్ ప్యాక్స్ సహాయపడతాయి.



మెంతి, మందారం ప్యాక్.. చుండ్రుకి కారణమయ్యే ఫంగస్‌ని తగ్గించడానికి మెంతులు ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. మెంతులలోని బయోటిన్, విటమిన్ ఎ, బి, సిలు జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతాయి. అలానే, మందారంలోని యాస్ట్రిజెంట్ లక్షణాలు జిడ్డు తత్వాన్ని, దురదను తగ్గించి చుండ్రు సమస్యకు చెక్ పెడతాయి. ఇందుకోసం మెంతి గింజల్ని రాత్రంతా నానబెట్టి మర్నాడు గుప్పెడు మందారాకులు చేర్చి మెత్తగా నూరుకోవాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి కురుల చివర్ల వరకు రాసి ఆరాక గాఢత తక్కువ ఉండే షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. చుండ్ర సమస్య దూరం అవుతుంది.

పెరుగు – కలబంద.. కప్పు కలబంద గుజ్జులో రెండు చెంచాల పెరుగు, అరచెక్క నిమ్మరసం కలిపి తలకు రాయాలి. ఇలా అరగంట ఉంచి తలస్నానం చేయండి. పెరుగులో ఉండే లాక్టిక్‌యాసిడ్, ప్రోబయాటిక్స్ కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కలబందలో హీలింగ్ ప్రాపర్టీస్, యాంటీబ్యాక్టీరియల్, యాంటీమైక్రోబియల్ గుణాలు.. చుండ్రు సమస్యకు చెక్ పెడతాయి.

పెరుగు, నిమ్మరసం.. చుండ్రు సమస్యకు చెక్ పెట్టడానికి.. పెరుగు, నిమ్మరసం ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. ఇందుకోసం నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడిలో రెండు టేబుల్‌స్పూన్ల నిమ్మరసం వేసి కలపాలి. ఆపై ఆ మిశ్రమంలో పెరుగు వేస్తూ పేస్ట్ అయ్యేంత వరకు ఉండలు లేకుండా మృదువుగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసుకొని అరగంట పాటు ఉంచుకోవాలి. ఇప్పుడు గాఢత తక్కువగా షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. చుండ్రు సమస్య దూరం అవుతుంది.

గుడ్డులోని తెల్లసొన జుట్టుకు పోషణ అందిస్తుంది. ఇది చుండ్రు సమస్యకు చెక్ పెడుతుంది. మూడు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడి, టేబుల్‌స్పూన్ ఆలివ్ నూనె, రెండు టేబుల్‌స్పూన్ల బాగా బీట్ చేసిన గుడ్డు తెల్లసొన.. ఈ మూడింటినీ ఒక బౌల్‌లో తీసుకొని కొద్దికొద్దిగా నీళ్లు కలుపుతూ మృదువైన పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసి 45 నిమిషాల పాటు ఉంచుకోవాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే క్రమంగా చుండ్రు సమస్య దూరం అవుతుంది.



# బరువు తగ్గడంతో పాటు సమస్యలు దూరం..

యాలకులు.. మంది కూరలు, మసాలాల్లో వాడతారు. వీటిని వాడడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. మనం తినే ఫుడ్‌కి మంచి రుచి, వాసన వచ్చేందుకు యాలకులు వాడతాం. ముఖ్యంగా స్వీట్స్ చేసేటప్పుడు వీటిని వాడతారు. ఇవి మాత్రమే కాదు.యాలకుల టీ, గరం మసాలా తయారు చేసినప్పుడు యాలకులు వాడతారు. ఈ యాలకులని ఆహారంలో రుచి పెరగడమే కాకుండా నాణ్యత కూడా పెరుగుతుంది. దీంతో పాటు కొన్ని లాభాలు కూడా ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి. నిద్ర సమస్యలు.. చాలా కారణాల వల్ల కొంతమందికి నిద్రపట్టదు. నిద్రలేక పోవడం వల్ల ఊబకాయంతో పాటు,



ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఇలాంటి సమస్యల్ని దూరం చేసేందుకు యాలకులు బాగా పనిచేస్తాయి. అందుకోసం యాలకులు మరిగించిన నీటిని తాగితే నిద్రలేమి సమస్యలు దూరం చేసి ఆందోళనని, టెన్షన్‌ని తగ్గిస్తుంది. గ్యాస్ సమస్యలు.. కొందరికీ జీర్ణ సమస్యలు వస్తాయి. మీరు గుండెల్లో మంట, గ్యాస్ సమస్యలతో బాధపడుతుంటే యాలకులని తినొచ్చు. దీనికోసం యాలకుల నీరు త్రాగడం, యాలకులని నమిలి ఆ రసాన్ని తినండి. దీని వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. బరువు తగ్గడం.. అధిక బరువు తగ్గాలనుకునేవారు మంచి రిజల్ట్స్ కోసం యాలకులని



వాడొచ్చు. వీటిని నీటిలో వేసి మరిగించి తాగొచ్చు. దీని వల్ల అదనపు కొవ్వుని కరిగిస్తుంది. బరువు తగ్గేందుకు ఓ గ్లాసు నీటిలో రెండు యాలకులు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఆ తర్వాత మరుసటి రోజు పరగడపున తాగితే బరువు తగ్గడం ఈజీ అవుతుంది. రక్త ప్రసరణ.. కొందరు టీ చేసేటప్పుడు యాలకు వాడతారు. టీ మరిగేటప్పుడు యాలకులు వేయాలి. దీని వల్ల ఈ టీ తాగితే రక్త ప్రసరణ పెరుగుతుంది. మన శరీరంలోకి రక్తం సరిగ్గా ప్రసరణ జరిగితేనే శరీర పనితీరు సక్రమంగా జరుగుతుంది. రక్తం సరిగ్గా ప్రవహిస్తేనే రక్తనాళల్లో అడ్డంకులు లేకుండా ప్రవహిస్తుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ వంటి ఆరోగ్య సమస్యల్ని తగ్గిస్తుంది. మూత్ర సమస్యలు.. మూత్ర వసర్జన సరిగ్గా





లేకపోతే అది ఆరోగ్యంపై ఎక్కువగా ఎఫెక్ట్ చూపిస్తుంది. ముఖ్యంగా కిడ్నీల ఆరోగ్యంపై. కొన్నిసార్లు మూత్రాన్ని ఆపుకుంటారు. దీనివల్ల కొన్ని సమస్యలు వస్తాయి. కిడ్నీల్లో రాళ్ళ వంటి సమస్య ఉంటే కూడా మూత్ర విసర్జన సరిగ్గా జరగదు. ఈ సమస్య దూరమవ్వాలంటే యాలకులు తినాలి. దీని వల్ల మూత్రంలో చీము వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి.

# మీ గుండె, లివర్ ఆరోగ్యంగా ఉంటాయ్..!

పంపర పనస.. బత్తాయిలకు అన్నయ్యాల్లా ఉంటాయ్. ఈ పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి డైట్‌లో చేర్చుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఈ పండు తింటే.. మీ గుండె, లివర్ ఆరోగ్యంగా ఉంటాయ్..! పంపర పనస.. చూడటానికి బత్తాయి, నారింజకాయల్లా ఉంటుంది. కానీ దీని సైజ్ వాటితో పోలిస్తే పెద్దగా ఉంటుంది. మన తెలుగు రాష్ట్రాల్లో ఈ పండ్లు ఎక్కువగా లభిస్తాయి, అదీ సీతాకాలంలో ఇవి విరివిగా కనిపిస్తాయి. పంపర పనసలో దానిమ్మ గింజల రంగు, తెల్లని తొనలు కూడా ఉంటాయి. దీని ముత్యాలు.. తీయగా, పుల్లగా ఉండి టేస్ట్‌గా ఉంటాయి. ఈ పండులో పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్6, విటమిన్, విటమిన్, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాల పోషకాలు మెండుగా ఉంటాయి. వ్యవస్థాపకురాలు ఎండోలిస్టిక్ న్యూట్రిషనిస్ట్ ప్రియాంషీ భట్నాగర్ పంపర పనస ఆరోగ్య ప్రయోజనాల గురించి మనకు వివరించారు.

విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.. పంపర పనసలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఒక పండు పంపర పనసలో రోజవారీ మనకు అవసరమైన విటమిన్ సి ఉంటుంది. గాయాలు త్వరగా మానడానికి, రోగనిరోధక శక్తి పెరగడానికి, విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవడానికి విటమిన్ సి ఉపయోగపడుతుంది. కణాంతరాల్లో కొల్లాజెన్ ఏర్పడటానికి దోహదపడుతుంది. దంతాలలో డెంటిన్ అనే పదార్థం ఏర్పడటానికి సహాయపడుతుంది. విటమిన్ సి మానసిక స్థితినీ మెరుగు పరుస్తుంది. హుషారు, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. విటమిన్ సి మెదడులో నాడీసమాచార వాహికల ఉత్పత్తికి తోడ్పడుతుంది.?%ఎఎజూశ్రీష్ట్రఎతీశీఱఎఱంఎ ంఎఎజూ–శీఎం%: పెద్దవారికి థైరాయిడ్ ఉంటే.. ఈ లక్షణాలు కనిపిస్తాయ్..!

గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.. పంపర పనసలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. పొటాషియం రక్తపోటును కంట్రోల్ ఉంచడానికి సహాయపడుతుంది. ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది, గుండె సమస్యల ముప్పును తగ్గిస్తుంది. పొటాషియం చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తగ్గిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.





బరువు తగ్గుతారు.. పంపర పనసలో కేలరీలు తక్కువగా ఉంటాయి, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఫైబర్ మిమ్మల్ని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. తద్వారా చిరుతిండ్లు ఎక్కువగా తినకుండా నియంత్రిస్తుంది. పంపర పనస బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కూడా కంట్రోల్‌లో ఉంచుతుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది.. పంపర పనసలో.. ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. ఫైబర్ పేగు కదలికలను ప్రోత్సహిస్తుంది, ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తుంది.



లివర్ ఆరోగ్యానికి మంచిది.. పంపర పనస పండులో.. విటమిన్‌సి, నరింగెనిన్, నారింగిన్, లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు... లివర్ పనితీరును మెరుగుపరు స్తాయి. ఇవి లివర్‌ని డీటాక్స్ చేయడానికి, శరీరం నుంచి వ్యర్థాలు, టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. పంపర పనసలో సమృద్ధిగా ఉండే.. విటమిన్ సి గాయాలు మానడానికి తోడ్పడుతుంది. విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. అదనంగా, ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఇన్ఫెక్షన్లను నివారించడానికి తోడ్పడతాయి.






ఏపీ: మంత్రి నారాయణ విజయవాడలో శనివారం సుడిగాలి పర్యటన చేపట్టారు. గత కొన్నిరోజులుగా వర్షం పడుతున్న నేపథ్యంలో.. పలు ప్రాంతాలలో పర్యటించారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఈ క్రమంలోనే అవుట్ ఫాల్ డ్రెయిన్ల కారణంగా నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలుగుతున్న సంగతి మంత్రి గుర్తించారు. ఈ నేపథ్యంలోనే అక్రమ కట్టడాలను తొలగించాలని అధికారులను నారాయణ ఆదేశించారు. ఇళ్లు కోల్పోయేవారికి టిడ్కో ఇళ్లు కేటాయించాలని సూచించారు.

# ఇళ్లు కోల్పోయే వారికి టిడ్కో ఇళ్లు

గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో విజయవాడ తడిసి ముద్దవుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ శనివారం విజయవాడలో సుడిగాలి పర్యటన చేపట్టారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర, ఇంజనీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగూరు నారాయణ విజయవాడలో పర్యటించారు. పుల్లేటి కట్ట, దర్శి పేట అవుట్ ఫాల్ డ్రెయిన్లు, బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ దిగువన వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాలను మంత్రి నారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే ఆటో నగర్ డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా అవుట్ ఫాల్ డ్రెయిన్లు నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారిన అక్రమ కట్టడాలు తొలగించాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి నారాయణ ఆదేశించారు. ఇళ్లు కోల్పోయే వారికి టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సూచించారు.

మరోవైపు విజయవాడ నగరంలో వర్షపు నీరు, మురుగునీరు బయటకు వెళ్లేలా 2014 లోనే డ్రైనేజీల నిర్మాణానికి సంకల్పించినట్లు మంత్రి నారాయణ వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. అయితే 2019 ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను మధ్యలోనే ఆపేసిందని నారాయణ విమర్శించారు. దీంతో డ్రెయిన్లు 10 అడుగులు ఉండాల్సిన చోట,, 2 అడుగుల వరకే ఉన్నాయన్నారు. అలాగే చాలాచోట్ల డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయని.. కొంతమంది కాలువలలో కాంపౌండ్ వాల్స్ కూడా కట్టేశారని అన్నారు. కాలువలలో ప్రహరీ గోడలు నిర్మించిన ప్రాంతాలలో వెడల్పు చేయకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని నారాయణ వివరించారు. పేదలను ఇబ్బందులు పెట్టాలనేది తమ ప్రభుత్వం ఉద్దేశం కాదన్న మంత్రి నారాయణ.. డ్రెయిన్లు వెడల్పు చేయకపోతే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అక్రమణలను గుర్తించి.. డ్రెయిన్లు వెడల్పు చేయాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి నారాయణ ఆదేశించారు. ఎక్కడైతే ఆక్రమణలు ఉన్నాయో.. అలాంటి చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు ఆ కుటుంబాలతో చర్చిస్తారని నారాయణ వెల్లడించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, సీఆర్డీఏ నిధులతో విజయవాడలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరుస్తామని.. సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేస్తామని నారాయణ వెల్లడించారు. వచ్చే వర్షాకాలం నాటికి విజయవాడ వాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని నారాయణ స్పష్టం చేశారు.

మరోవైపు బుడమేరు ఆక్రమణలకు సంబంధించి నీటిపారుదల శాఖ సాంకేతిక కమిటీ వేసిందని నారాయణ వెల్లడించారు. బుడమేరు విషయంలో రెండు రకాల ప్రతిపాదనలున్నాయన్న ఆయన.. నీటిపారుదల శాఖ అధికారులతో కార్పోరేషన్ అధికారులు సమన్వయం చేసుకుని త్వరలోనే బుడమేరుపై కీలక నిర్ణయం తీసుకుంటారని వివరించారు.



## కొత్త నేషనల్ హైవే నాలుగు లైన్లుగా..

రాయలసీమ: రాయలసీమవాసులకు, ముఖ్యంగా తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు తీపికబురు. చిత్తూరు, అనంతపురం, అన్నమయ్య, కడప జిల్లాల నుంచి తిరుమలకు వెళ్లేందుకు మరో హైవే అందుబాటులోకి వస్తోంది. మదనపల్లె నుంచి తిరుపతికి వెళ్లే హైవే పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ హైవేలో మొదటి దశ పనులు మదనపల్లె నుంచి పీలేరు మీదుగా తిరుపతి జిల్లాలోని భాకరాపేట వరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలో వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చారు.. ఈ మార్గం పూర్తయితే తిరుపతికి వెళ్లడానికి పట్టే సమయం తగ్గుతుంది అంటున్నారు. ఈ హైవే 71 కోసం కేంద్రం భారత మాల పరియోజన కింద రూ.1,852.12 కోట్లు నిధులు ఇచ్చింది. గతంలో ఈ రోడ్డు రెండు వరుసలుగా ఉండేది.. ఇప్పుడు నాలుగు వరుసలుగా విస్తరించారు. గతంలో తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్లేందుకు నాలుగు గంటల సమయం పడితే.. ఇప్పుడు జస్ట్ 2.30 గంటల్లోనే వెళ్లొచ్చు.

రూ.1,852 కోట్లతో మదనపల్లె-పీలేరు మధ్య 55.90 కి.మీ రహదారి నిర్మాణం పూర్తి చేశారు. అయితే మదనపల్లె దగ్గర భూసేకరణ వల్ల హైవేకు సంబంధించిన కొన్ని పనులు ఆగిపోగా.. వీటిని కూడా త్వరలోనే పూర్తి చేయనున్నారు. తిరుపతి దగ్గర చెర్లోపల్లె నుండి పీలేరు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. మొత్తం 38.17 కి.మీ లలో ప్రస్తుతానికి 18.10 కి.మీ రహదారిని రూ.357 కోట్లతో నిర్మించారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో భాకరాపేట నుంచి కనుమ మీదుగా చెర్లోపల్లె వరకు మిగిలిన 20 కి.మీ రహదారి నిర్మాణం ఆగిపోయింది. ఈ హైవేలో మదనపల్లె-పీలేరు మధ్య గండిబోయినపల్లె టోల్ ఫీజు వసూలు చేసేందుకు ప్లాజా నిర్మించారు.. బ్రిడ్జిలు, గ్రామాలున్న చోట్ల సర్వీస్ రోడ్లు, అప్రోచ్ రోడ్లతో పాటుగా క్రాస్ రోడ్ల దగ్గర స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేశారు.

అలాగే గ్రామాల ప్రజల రాకపోకల కోసం అండర్ పాస్‌లు నిర్మించారు.. రైల్వే లైన్ల వద్ద ఆర్వోబీలు ఉన్నాయి. ఈ హైవేలో ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు.. వీటి ద్వారా ప్రమాదాలను గుర్తింపు, వాహనాలపై నిఘా, ట్రాఫిక్ ఎలా ఉందో కూడా గమనించడానికి వీలు ఉంటుంది అంటున్నారు. ఈ సీసీ కెమెరాలను టోల్‌ప్లాజా దగ్గర ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. అప్పుడు రోడ్డుపై ఏం జరిగినా తెలుసుకోవచ్చు. త్వరలోనే మిగిలిన పనులు కూడా పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామంటున్నారు. ప్రస్తుతం అయితే మదనపల్లె వయా పీలేరు నుంచి తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట వరకు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తం మీద ఈ జాతీయ రహదారితో రాయలసీమ ప్రజలు తిరుపతికి త్వరగా వెళ్లొచ్చు అంటున్నారు.

## దొంగ అనుకుని చితకబాదారు..

తిరుపతి: పాపం ఆ యువకుడికి ఊహించని అనుభవం ఎదురైంది. మనోడ్ని ఇంటికి రమ్మని ప్రియు రాలు పిలిచింది.. వెంటనే వెళ్లిన యువకుడికి ఊహించని విధంగా చిక్కుల్లో పడ్డాడు. తిరుపతి జిల్లాలో దొంగగా భావించి స్థానికులు చితకబాదారు, స్తంభానికి కట్టేసి కొట్టారు. అసలు విషయం చెప్పడంతో అందరూ నవ్వుకున్నారు. మరో ఘటనలో, చిత్తూరు జిల్లాలో బాలిక ప్రేమించి పెళ్లి చేసుకుని పరారైంది, పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రకపోయి ఇరుక్కుపోవడం అంటే ఇదేనే మో.. పాపం ప్రియురాలు రమ్మని పిలిచిందని వెళ్లిన ఆ యువకుడికి చేదు అనుభవం ఎదురైంది. దొంగగా భావించి స్థానికులు చితకబాదారు.. నేను దొంగను కాదు బాబోయ్ అని మొత్తుకున్నా వినకుండా స్తంభానికి కట్టేసి కొట్టారు. అప్పుడు ప్రియురాలి కోసం వచ్చానంటూ అసలు మ్యాటర్ చెప్పేసరికి అందరూ నవ్వుకున్నారు. పెనుమూరుకు చెందిన యువకుడు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం మల్లయ్యపల్లి వచ్చాడు. స్థానికంగా ఉంటున్న యువతిని కలిసేందుకు అర్ధరాత్రి వెళ్లాడు. మనోడు గ్రామంలోకి రాగానే కుక్కలు పెద్దగా అరిచాయి. కుక్కల అరుపులు విని స్థానికులు బయటకు వచ్చి చూస్తే యువకుడు కనిపించాడు.. అందరూ కలిసి అతడి వెంటపడ్డారు. మనోడు ముళ్లపొదల మధ్యకు వెళ్లి దాక్కున్నాడు.. స్థానికులు గాలించి అతడ్ని పట్టుకుని స్తంభానికి కట్టేసి చితకబాదారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఊరికి చేరుకున్నారు.. వారు ఎందుకొచ్చావని ఆరా తీస్తే అసలు సంగతి చెప్పాడు. తాను గ్రామానికి చెందిన యువతిని కలిసేందుకు వచ్చినట్లు చెప్పాడు.. ఆమె రమ్మని చెప్పడంతో వచ్చినట్లు వివరించాడు. పోలీసులు ఆ యువకుడి తల్లిదండ్రుల్ని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి ఆస్పత్రికి పంపించారు. పాపం యువతిని కలుద్దామని వస్తే ఇలా బుక్కైపోయి తన్నులు తినాల్సి వచ్చింది.

చిత్తూరు జిల్లాలో 16 ఏళ్ల బాలిక ఒక యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుని పరారైంది. కార్వేటినగరం మండలానికి చెందిన బాలికకు తల్లిదండ్రులు లేరు. తిరుపతి బాలికల సంరక్షణ కేంద్రంలో ఉంటోంది.. బాలిక అక్క బీఎన్‌ఆర్‌పేటలో నివాసం ఉంటోంది. అయితే ఆ బాలిక అప్పుడప్పుడు అక్క ఇంటికి వెళ్లేది. అయితే బీఎన్‌ఆర్‌పేటలో యాదమరి మండలానికి చెందిన 23 ఏళ్ల యువకుడు ఒక దుకాణం నడుపుతున్నాడు.. ఈ క్రమంలో అతడికి బాలిక పరిచయమై ప్రేమగా మారింది. అయితే బాలిక సంరక్షణ కేంద్రం నుంచి పారిపోయింది.. యువకుడిని పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. ఈ విషయం సంరక్షణ కేంద్రం సిబ్బందికి తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బెంగళూరు లో ఉన్నట్లు గుర్తించి బీఎన్‌ఆర్‌పేట తీసుకొ చ్చారు. వైద్య పరీక్షల కోసం చిత్తూరు ఆస్పత్రి చేర్పించగా.. పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేశారు.

## పెద్ద ప్రమాదమే తప్పిపోయింది

శ్రీ సత్యసాయి: జిల్లాలో రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఊహించని అడ్డంకి ఎదురైంది. పెనుకొండ దగ్గర రైలు ఇంజిన్‌పైకి నెమలి వచ్చి పడటంతో ఒక్కసారిగా రైలు నిలిచిపోయింది. హై వోల్టేజ్ విద్యుత్ లైన్ కావడంతో నెమలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూశారు. దాదాపు అరగంట పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు టెన్షన్ పడ్డారు. నెమలి దెబ్బకు ఎక్స్‌ప్రెస్ రైలు ఆగిపోయింది.. దాదాపు అరగంటసేపు అందరూ టెన్షన్ పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన ఘటన చర్చనీయాంశంగా మారింది. రాజ్ కోట్ ఎక్స్‌ప్రెస్ రైలు తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు వెళుతుంది. ఈ రైలు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ, చెన్నేకొత్తపల్లి మార్గంలో ధర్మవరం వెళుతుంది. అయితే ఆ రైలు మార్గంలో రైల్వే లైన్ పనులు జరుగుతున్నాయి.. ఈ క్రమంలో శుక్రవారం రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ పెనుకొండ నుంచి పుట్టపర్తి ప్రశాంతి రైల్వే స్టేషన్ సమీపానికి వచ్చింది.. ఇంతలో ఓ ఘటన జరిగింది.

రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్ పైభాగంలో నెమలి ఎగురుతూ వచ్చి విద్యుత్తు లైనుపై పడింది. ఈ లైన్‌కు హైవోల్టేజీ ఉండటంతో నెమలి అక్కడికక్కడే చనిపోయింది. నెమలి ఇంజన్ పైన వచ్చి పడటాన్ని రైల్వే లోకో పైలట్ గుర్తించారు. రైలు ప్రశాంతి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే అక్కడే నిలిపేశారు. అయితే నెమలి ఇంజన్‌పైన పడిన తర్వాత అదృష్టవశాత్తు మంటలు రాలేదు.. ఒకవేళ వచ్చి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది.. పెను ప్రమాదం తృటిలో తప్పిపోయింది. ఈ ఘటన జరిగిన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందింది.. వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత విద్యుత్ లైన్‌పై పడిన నెమలిని అక్కడి నుంచి తొలగించారు. ఈ ఘటనతో ప్రశాంతి రైల్వే స్టేషన్‌లో అరగంట పాటూ ఆగిపోయింది.. ఆ తర్వాత బయల్దేరి వెళ్లిపోయింది. మొత్తానికి ఒక నెమలి అరగంట పాటూ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపేసింది.

మరోవైపు నర్సాపురం నుంచి ధర్మవరం వరకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు రద్దైంది. వారం పాటూ ఈ రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆగస్టు 11 నుంచి 18 వరకు రైలు రద్దు కానుంది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో మూడో రైల్వే లైన్ నాన్- ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగానే రైల్వే అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. దాదాపు 50కిపైగా రైళ్లను అధికారులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## లెక్చరర్‌కు షాకిచ్చిన అమ్మాయి..

ఐదేళ్ల క్రితం చదువు చెప్పే సమయంలో.. ఆపదలో ఉన్నానంటూ కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థిని బాధ చూడలేక ఆర్థిక సహాయం చేయటమే ఇప్పుడు అతని పాలిట శాపంగా మారింది. సాయం చేసిన ఉపాధ్యాయునితో సాన్నిహిత్యం పెంచుకుని సరసమాడిన ఆ మాజీ విద్యార్థిని.. ఇప్పుడు ఆ గురువునే ప్రియుడితో కలిసి బ్లాక్‌మెయిల్ చేస్తోంది. ప్రియుడితో అనగానే ఆమె ఏదో పడుచు పిల్ల అనుకునేరు. ఇప్పటికే ఓసారి పెళ్లి చేసుకుని.. మొగుడితో దూరంగా ఉంటూ.. ఖాళీగా ఉండటమేందుకని ప్రస్తుతం ప్రియుడితో కలిసి సహజీవనం చేస్తోంది ఆ అమ్మాయిగారు. అయితే.. అప్పుడెప్పుడో సారుతో సరదాగా కాస్త రొమాంటిక్‌గా మాట్లాడిన కాల్ రికార్డింగులు తవ్వకాల్లో బయటపడితే.. వాటిని అస్త్రంగా చేసుకుని ఇప్పుడు డబ్బులివ్వాలంటూ బ్లాక్ చేస్తోంది ఈ స్టార్ మహిళ.

## పులస చేపలు కొంటున్నారా.. మోసపోవద్దు

గోదావరి: గోదావరి జిల్లాల్లో పులస చేపల సీజన్ మొదలైంది.. గోదావరికి ఎర్ర నీరు వచ్చి చేరుతుండటంతో పులసలు కూడా క్యూ కట్టాయి. మత్స్యకారులకు ఒకటి, అర అన్నట్లుగా అక్కడక్కడ పులసలు దొరుకుతున్నాయి. అలా దొరికిన పులసల కోసం జనాలు ఎగబడతున్నారు.. కేజీ చేప కోసం ఏకంగా వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. అయితే పులసల పేరుతో మరో కొత్త దందా జరుగుతోంది.. పులస చేపల పేరు చెప్పి విలస చేపల్ని అండగడుతున్నారనే టాక్ వినిపిస్తోంది. గోదావరిలో పులస చేపలు కనిపించకపోయినా.. యానాం మార్కెట్లో మాత్రం పుష్కలంగా దొరుకుతున్నాయట.



యానాం మార్కెట్‌లో పులస చేపల గురించి ఆరా తీస్తే.. కొందరు వ్యాపారులు కోల్‌కతా, హౌరా నుంచి విలస చేపలను తెచ్చి పులసల పేరుతో అమ్ముతున్నారట. పులస చేపలకు ఉన్న డిమాండ్‌ను వీరు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడ విలస చేపలు సైజును బట్టి రూ.600 నుంచి రూ.1300 వరకు పలుకుతున్నాయి. గోదావరి జిల్లాల్లో పులస చేపలకు మంచి డిమాండ్ ఉందని తెలిసి విలస చేపలను తెచ్చి అమ్ముతున్నారట. బంగాళాఖాతంలో లభ్యమయ్యే ఈ విలస చేపల్ని హౌరా, కోల్‌కతా నుంచి రైళ్లలో కాకినాడకు తెస్తున్నారు. అక్కడి నుంచి ఆటోల్లో యానాం మార్కెట్‌కు పులస చేపల్ని చేరవేస్తున్నారు. అయితే చూడటానికి రంగు, వాసన ఒకేలా ఉంటుంది.. కానీ విలస, పులస చేపల రుచిలో తేడా ఉంటుంది. గోదావరిలో పట్టుకొచ్చిన పులస చేపను వెంటనే మార్కెట్‌కు తీసుకొచ్చి వేలం పాట నిర్వహిస్తారు.. కాబట్టి తాజాగా ఉంటుంది. ఈ విలస చేపల్ని సముద్రంలో పట్టుకుని యానాంకు తీసుకొచ్చేసరికి రెండు, మూడు రోజుల సమయం పడుతుంది.. అప్పుడు ఆ చేపలు చూడటానికి తాజాగా ఉండవు. అలా విలస, పులసల మధ్య తేడాను తెలుసుకోవచ్చంటున్నారు. అయితే ధవళేశ్వరం, రాజమహేంద్రవరం మార్కెట్లో దొరికే పులస చేపల రుచి బావుంటుంది అంటున్నారు. అంతేకాదు గోదావరిలో కూడా పులస చేపలు పెద్దగా వలకు చిక్కడం లేదని చెబుతున్నారు. పదుల సంఖ్యలోనే చేపలు దొరుకుతున్నాయట.. ఒకప్పుడు లక్షల్లో వ్యాపారం జరిగేదని.. ఇప్పుడు అంత వ్యాపారం లేదంటున్నారు.

## ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు

ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వం చేనేత కళాకారులకి అండగా నిలుస్తూ, ఆర్థికంగా చేయూతనిస్తోంది. కేంద్రం సాయంతో ముద్ర పథకం ద్వారా రుణాలు అందిస్తూ, చేనేత ఉత్పత్తులకి ప్రోత్సాహం ఇస్తోంది. కొత్త టెక్నాలజీతో పోటీ పడుతూ, నేతన్నలకి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగానే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తూ, రాయితీలు కూడా అందిస్తోంది. అంతేకాదు, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి 10 అవార్డులు రావడం విశేషం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిచింది.. కేంద్రం సాయంతో ముద్ర పథకం ద్వారా ఈ రుణాలు ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, నేతన్నలకు భరోసా కల్పించే దిశగా చేనేత కార్మికులకు ఆర్థికంగా సహాయం అందిస్తున్నారు. కొంతకాలంగా కొత్త టెక్నాలజీ రావడం, మిల్లుల్లో తక్కువ ధరకే వస్త్రాలు, నూలు ధరలు పెరగడం వల్ల చేనేత వస్త్రాల అమ్మ కాలు తగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే చేనేతల్ని ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంక్షేమ పథకాలతో పాటు రుణ సాయం కూడా పెంచింది.

ముద్ర పథకం ద్వారా చేనేత కార్మికులు ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణం అందిస్తున్నారు. ఈ రుణంలో ప్రభుత్వం 20 శాతం రాయితీ అందిస్తుంది.. తక్కువ వడ్డీకే రుణం ఇస్తుంది. చేనేత కార్మికులు ఈ రుణానికి సంబంధించి మూడేళ్ల కాలానికి ఆరు శాతం వడ్డీ చెల్లించాలి. అయితే ఈ పథకం కింద చేనేత కార్మికుడిగా గుర్తింపు పొంది, సొంత మగ్గం ఉన్నవారికి ఈ రాయితీ రుణం ఇస్తారు. ఈ మేరకు చేనేతల నుంచి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 10 అవార్డులు వచ్చాయి. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాల చేతుల మీదుగా మంత్రి సవిత, కలెక్టర్లు ఈ అవార్డులు అందుకున్నారు. దేశవ్యాప్తంగా ఇచ్చిన 29 అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు 10 రావడం విశేషం. రాష్ట్రాలకు ఇచ్చిన ఎ-క్యాటగిరీ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ బంగారు పతకం గెలుచుకుంది. దేశంలోని ఒక్కో జిల్లాలో ఒక్కో ప్రత్యేక ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది అంటున్నారు. బాపట్ల జిల్లా (చీరాల పట్టు చీరలు-కుప్పాడం), శ్రీసత్యసాయి జిల్లా (ధర్మవరం పట్టుచీరలు) రజతం, తిరుపతి జిల్లా (వెంకటగిరి కాటన్ చీరలు) బంగారు పతకం, కాకినాడ జిల్లా (పెద్దాపురం సిల్క్) కాంస్యం, విజయనగరం జిల్లా (బొబ్బిలి వీణ) బంగారు పతకం, అనకాపల్లి జిల్లా (ఏటికొప్పాక బొమ్మలు), పశ్చిమ గోదావరి జిల్లా (నరసాపురం లేస్ అల్లికలు) ప్రత్యేక బహుమతి, గుంటూరు జిల్లా (మిరప) బంగారు పతకం, శ్రీకాకుళం జిల్లా (జీడిపప్పు) కాంస్య పతకం దక్కింది.

## పాత ఫర్నీచర్‌తో రూ.25 లక్షలు ఆదా..

నూజివీడు: ట్రిపుల్ ఐటీలో వ్యర్థంగా పడి ఉన్న పాత ఫర్నీచర్‌కు పూర్వ వైభవం వచ్చింది. ఇంఛార్జ్ డైరెక్టర్ అమరేంద్రకుమార్ చొరవతో విరిగిపోయిన కుర్చీలు, బల్లలను రూ.500 ఖర్చుతో కంప్యూటర్ టేబుళ్లుగా మార్చారు. కొత్తవి కొంటే రూ.5 వేలు పైగా ఖర్చయ్యేది, కానీ ఇప్పుడు తక్కువ ధరకే టేబుళ్లు సిద్ధమయ్యాయి. సుమారు రూ.25 లక్షల విలువైన ఫర్నీచర్‌ను తిరిగి ఉపయోగంలోకి తీసుకురావడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి.

మన ఇంట్లో విరిగిపోయిన చెక్క వస్తువుల్ని (తలుపులు, మంచాలు, కుర్చీలు, టేబుళ్లు) ఏం చేస్తాం.. ఏముంది తీసుకెళ్లి ఓ మూలన పడేస్తాం.. పల్లెటూర్లలో అయితే పొయ్యిలోకి వాడేస్తున్నారు. కొంతమంది అయితే పాత సామగ్రి కొనుగోలు చేసేవారికి ఇచ్చేస్తారు. అదే ప్రభుత్వ కార్యాలయాల్లో ఫర్నీచర్ అయితే టెండర్లు పిలిచి అమ్మేస్తారు. కానీ ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మాత్రం పనికిరాని ఫర్నీచర్‌ను మళ్లీ ఉపయోగంలోకి తీసుకొచ్చారు. నిరుపయోగంగా పడిఉన్న వాటిని మళ్లీ ఉపయోగించుకునేలా అద్భుతం చేశారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో పనికిరాని ఫర్నీచర్ చాలానే ఉందట.. ఎక్కువగా విరిగిపోయిన కుర్చీలు, బల్లలు, టేబుళ్లు, తలుపులు, మంచాలు వంటివి పక్కన పడేశారు. ఏకంగా వందల సంఖ్యలో ఉన్నాయట.. ఈ విషయాన్ని నూజివీడు ట్రిపుల్ ఐటీ ఇంఛార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ గమనించారు. వెంటనే వాటిని ఉపయోగంలోకి వచ్చేలా ప్లాన్ చేశారు.. కార్పెంటర్‌ను పిలిచి ఒక్కో టేబుల్‌కు రూ.500 వెచ్చించి కొత్త టేబుల్‌లా తయారు చేయించారు. కొత్త టేబుల్ కొనుగోలు చేయాలంటే దాదాపు రూ.5 నుంచి 6 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.. ఇప్పుడు పాత ఫర్నీచర్‌తో జస్ట్ రూ.500కే టేబుల్ సిద్ధమైంది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో పాడైపోయిన ఫర్నీచర్‌ను విక్రయిస్తే రూ.3 లక్షల వరకు వచ్చేవి. ఇప్పుడు దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేసి ఏకంగా 500 టేబుళ్లను సిద్ధం చేయించారు. ఇలా ఏకంగా రూ.25 లక్షల విలువైన ఫర్నీచర్‌ను సమకూర్చుకున్నారు. ఈ ఫర్నీచర్‌ను 2008లో ట్రిపుల్ ఐటీ ప్రారంభించిన సమయంలో కొనుగోలు చేశారట. ఆ ఫర్నీచర్‌ను ఇప్పుడు టేబుళ్లుగా తయారుచేసి వినియోగించుకుంటున్నారు. ఈ టేబుళ్లు విద్యార్థులకు కంప్యూటర్ టేబుళ్లగా ఉపయోగపడతాయంటున్నారు. ఎందుకంటే నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రతి విద్యార్థికి ఒక ల్యాప్‌టాప్ ఇస్తారు. దానిని జాగ్రత్తగా ఉంచుకోవడానికి.. అలాగే ఛార్జింగ్ పెట్టుకోవడానికి ఉపయోగంగా ఉంటాయంటున్నారు. మొత్తానికి ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్‌కు వచ్చిన ఒకే ఒక్క ఐడియాతో దాదాపు రూ.25 లక్షలు ఆదా చేశారు.

## కారవాన్ పార్కులు.. అక్కడే..

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అనేక ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే కొత్తగా కారవాన్ పార్కులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది. ఏపీ కారవాన్ టూరిజం పాలసీలో భాగంగా కొన్నిచోట్ల కారవాన్ పార్కులు అభివృద్ధి చేయనున్నారు. వీటి ద్వారా సందర్శకులను ఏపీలోని పర్యాటక ప్రాంతాలకు ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరికొన్ని రోజుల్లోనే ఈ పాలసీకి ఆమోదం లభించే అవకాశాలు ఉన్నాయి.

పర్యాటక రంగం అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పర్యాటక రంగాన్ని ఇండస్ట్రీగా గుర్తించి ప్రోత్సాహకాలు అందిస్తోంది. అలాగే హోమ్‌స్టేలు, ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుతో సందర్శకులను ఏపీలోని అద్భుత ప్రకృతి సోయగాల మధ్యకు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ పర్యాటక శాఖ మరో కొత్త ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో అనుసరిస్తున్న కారవాన్ టూరిజం పాలసీలను స్ఫూర్తిగా తీసుకుని ఏపీ ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా కారవాన్ టూరిజం పాలసీ తీసుకురానుంది. కారవాన్ టూరిజం పాలసీలో భాగంగా రాష్ట్రంలో కొన్నిచోట్ల కారవాన్ పార్కులు ఏర్పాటు చేసే ఆలోచన చేస్తోంది.

అరకు, భీమిలి సహా రాష్ట్రంలోని మరికొన్ని టూరిస్ట్ స్పాట్లలో ఈ కారవాన్ పార్కులు ఏర్పాటు చేయాలని ఏపీ పర్యాటక శాఖ ఆలోచన చేస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదు ప్రదేశాల్లో ఈ కారవాన్ పార్కులు అభివృద్ధి చేయనున్నారు. సందర్శకులు మునుపెన్నడూ చూడని పర్యాటక ప్రదేశాలకు తీసుకువెళ్లేలా ఈ కారవాన్ పార్కులు ద్వారా ఆకర్షించవచ్చని అధికారులు చెప్తున్నారు. పర్యాటకులు కావాలనుకున్నప్పుడు విశ్రాంతి తీసుకునేలా 24 గంటలూ అందుబాటులో ఉండే వాహనాలు, అలాగే వసతి సౌకర్యాలు, పార్కింగ్ స్థలం ఈ కారవాన్ పార్కులలో ఏర్పాటు



చేయనున్నారు. వీటితో పాటుగా వాకింగ్ ట్రాక్‌లు, సిట్-అవుట్ ప్రాంతాలు, బ్యాడ్మింటన్ కోర్టులు వంటి వినోద ప్రదేశాలు, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలను అభివృద్ధి చేస్తారు. పర్యాటకులకు థ్రిల్లింగ్ అనుభవాలను అందించడానికి అడవులలోని సుందరమైన ప్రదేశాలకు సమీపంలో కారవాన్ పార్కులను అభివృద్ధి చేస్తారు. కారవాన్ టూరిజం పాలసీ ముసాయిదాను పర్యాటక శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మంత్రివర్గంలో ఈ పాలసీపై చర్చించి.. ఆ తర్వాత ఆమోదం తెలిపే అవకాశం ఉంది. మరోవైపు ఏపీ టూరిజం శాఖ అధికారులు కారవాన్ టూరిజం కూడా ప్రోత్సహిస్తు న్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించి న టూరిజం కాన్‌క్లేవ్‌లో కారవాన్లు ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ.. మరో ప్రైవేటు సంస్థతో కలిసి రెండు కారవాన్లను అభివృద్ధి చేయనుంది. ఒక కారవాన్‌లో 12 మంది, మరో కారవాన్‌లో 8 మంది ప్రయాణించేలా వీటిని డిజైన్ చేశారు. హైదరాబాద్ -గండికోట, హైదరాబాద్ -సూర్యలంక మధ్యన ఈ కారవాన్‌లు నడిపే ఆలోచనలో ఉన్నారు. ఒక్కో కారవాన్‌లో బెడ్, కాన్ఫరెన్స్ హాల్, టీవీ, ఏసీ, ఫ్రిడ్జ్, మైక్రోవేవ్ ఓవెన్, కిచెన్, వాష్ రూం, సౌండ్ సిస్టమ్స్, సెక్యూరిటీ కెమెరాలు వంటి అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రకృతి ప్రేమికులు.. కదిలే ఇల్లు లాంటి సౌకర్యాలతో ప్రకృతి ఒడిలో సేదతీరవచ్చు.

## మీకు రేషన్ కార్డు రాలేదా..?

# ఇలా చేయండి..



తెలంగాణ: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న చాలా మంది ఎదురు చూపులకు కాంగ్రెస్ ప్రభుత్వం వారి కలను సాకారం చేస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల లోపే వారి అప్లికేషన్లను స్క్రుటినీ చేసి.. అర్హులకు రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నారు. కొంతమంది దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్ రిజెక్ట్ కాగా.. అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే.. రేషన్ కార్డులను మంజూరు చేస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాం నుండి ఎదురుచూస్తున్న అనేకమంది దరఖాస్తుదారుల ఆశలను నెరవేరుస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే అప్లికేషన్లను పరిశీలించి.. అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నారు. దరఖాస్తులు తిరస్కరించబడిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా కార్డులు మంజూరు చేస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు కీలకం..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు తప్పనిసరి. ప్రస్తుతం రేషన్ కార్డులు లేనిదే చాలా పథకాలకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో.. రేషన్ కార్డుల పంపిణీ ఒక నిరంతర ప్రక్రియ అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి నల్గొండ జిల్లా, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతన ఆహార భద్రతా కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిర్యాలగూడ నియోజక వర్గంలో కొత్తగా సుమారు 15 వేల రేషన్ కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. ఇప్పటికీ రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం వెంటనే వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి కార్డులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. దరఖాస్తు చేసుకొని రిజెక్ట్ అయిన వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రిజెక్ట్ అవ్వడానికి గల కారణం తెలుసుకొని.. మళ్లీ ఆ తప్పు రిపీట్ కాకుండా.. దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులను అందజేస్తోందని.. అంతేకాకుండా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎక్కడైనా రేషన్ బియ్యం పక్కదారి పడితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల వంటివి ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచే కార్యక్రమాలని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇక్కడి ప్రజలు చైతన్యవంతులని, ముఖ్యంగా ప్రతిష్టాత్మకమైన సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ ఇక్కడ నుండే జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు వెంటనే నమోదు చేయించుకోవాలని, ఇది ప్రజల హక్కు అని ఉద్ఘాటించారు. ఎవరైనా చనిపోయిన లేదా రేషన్ కార్డులలో పేర్లు తప్పుగా నమోదై ఉంటే స్వచ్ఛందంగా వారి పేర్లను తీసివేయించాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 11,691 కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా.. మీ రేషన్ కార్డు స్టేటస్ తెలుసుకోవాలంటే.. ఇక్కడ క్లిక్ చేయండి. ఇక్కడ మీ సేవా దరఖాస్తు నంబర్‌ను ఎంటర్ చేసి.. మీ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చు. ఇదిలా ఉండగా.. గత ఆరు నెలలుగా రేషన్ తీసుకొని వారి డేటాను ప్రభుత్వ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవ్వండి..




తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. సెప్టెంబర్ 30 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించడంతో, అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎస్ఈసీ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది వివరాలు అందజేయాలని ఆదేశించింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగాలు చర్యలు చేపట్టనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా.. సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా సెప్టెంబర్ 30 నాటికి ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఎస్ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా.. జిల్లా యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహాలను వేగవంతం చేస్తున్నాయి.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన వనరుల లభ్యతను అంచనా వేయడానికి.. రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు కొన్ని సూచనలు చేసింది. ఆయా జిల్లాల్లో ఎన్నికలను ఎన్ని విడతల్లో నిర్వహించాల్సి ఉంటుంది అనే అంశంపై స్పష్టమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించింది.

ఓటర్ల జాబితా తయారీ వంటి ప్రాథమిక అంశాలపై కూడా వివరాలు అందించాలని కలెక్టర్లను కోరింది. ఇది ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన కార్యాచరణను ఖరారు చేయడానికి దోహదపడుతుంది. ఈ సమగ్ర ప్రణాళికలు ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా.. సకాలంలో పూర్తి చేయడానికి సహాయపడతాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల సామగ్రిని సమకూర్చుకోవడం, పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై కూడా కలెక్టర్లు దృష్టి సారించాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించింది. మొత్తంగా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తెలిపింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలను కచ్చితంగా సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల నిర్వహణకు పూర్తిగా సిద్ధంగా ఉండాలని నిర్దేశించింది. హైకోర్టు ఆదేశాలను పక్కాగా పాటించి, నిర్ణీత గడువులోగా ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఎస్ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియలో పారదర్శకతను, నిష్పక్షపాతాన్ని పాటించడం అత్యంత ముఖ్యం. ప్రజాస్వామ్య ప్రక్రియలో స్థానిక సంస్థల ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరడంలో స్థానిక సంస్థలు వారధులుగా పనిచేస్తాయి. కాబట్టి.. సకాలంలో ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, స్థానిక పాలన బలోపేతానికి దోహదపడుతుంది. ఈ ఆదేశాలతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. అంతే కాకుండా.. జిల్లా యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సన్నాహాలను ప్రారంభిస్తాయి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి తెలంగాణ కేబినెట్‌లో చర్చించనున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు కీలక అప్డేట్



తెలంగాణ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు శరవేగంగా జరుగుతోందని గృహనిర్మాణ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతం తెలిపారు. ఇప్పటివరకు 1.74 లక్షల మంది లబ్ధిదారులు తమ గృహ నిర్మాణ పనులను ప్రారంభించారని ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు 57 వేల గృహాలు బేస్‌మెంట్ దశను పూర్తి చేసుకుని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని గౌతం వెల్లడించారు. వీటిలో 5 వేల గృహాలు త్వరలోనే ప్రారంభోత్సవా నికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అత్యంత పేదలకు గృహాలను మంజూరు చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ.386.12 కోట్లు విడుదల చేసిందని, ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని వివరించారు. ఈ వారంలోనే రూ.115 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. పథకం ప్రారంభమై రెండు నెలలు మాత్రమే అయినా నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని వి.పి.గౌతం పేర్కొన్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులకే ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లబ్ధిదారులుగా ఎంపికైన 12,700 మంది వివరాలపై అభ్యంత రాలు వచ్చాయని, దీనిపై జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరిపి నివేదిక తీసుకున్నామని చెప్పారు. ఈ పరిశీలనలో 10,700 మంది నిబంధనల ప్రకారం అర్హులుగా నిర్ధారించ బడ్డారని, అయితే 1,950 మంది అనర్హులుగా తేలిందని తెలిపారు. 20 వేల మంది లబ్ధిదారులకు గృహాలు రద్దు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరు, పురోగతిపై స్పష్టతని చ్చారు. పేదలు ఇండ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ చేస్తున్నారు.

# కేసీఆర్ నేతృత్వంలో మరో ఉద్యమం..

తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానాలపై, ఆయన పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు. రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాలు, తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారంటూ ఆరోపణలు గుప్పించిన హరీశ్ రావు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు వల్ల కలిగే నష్టంపై ప్రజెంటేషన్ ఇచ్చి, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై బీఆర్ఎస్వీ నేతలకు దిశానిర్దేశం చేశారు. హరీశ్ రావు తన ప్రసంగంలో రేవంత్ రెడ్డిపై ఘాటైన విమర్శలు చేశారు. 'తెలంగాణ ద్రోహుల జాబితా రాస్తే, మొదటి పేరు చంద్రబాబు నాయుడుది ఉంటే, రెండో పేరు రేవంత్ రెడ్డిది ఉంటుంది' అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారుల పైకి రేవంత్ రెడ్డి రైఫిల్ తీసుకొని వెళ్లిన ద్రోహి అని ఆరో పించారు. సీఎం రేవంత్‌రెడ్డికి నిద్రలో కూడా కేసీఆర్ గుర్తుకు వస్తున్నారని, హరీశ్ రావు ఎద్దేవా చేశారు. 'రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదు. ఉద్యమ గుర్తులు, చరిత్రను చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయి' అని హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ, చంద్రబాబు కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గురు శిష్యులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ) కలిసి తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తా మని హరీశ్ రావు ప్రకటించారు. గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించే కుట్ర జరుగుతోందని, ఈ విషయంలో రేవంత్‌రెడ్డి నిలదీసే పరిస్థితి లేదని అన్నారు. జల వివాదాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ.. కేసీఆర్ నేతృత్వంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని, అవసరమైతే భారత రాష్ట్ర సమితి తరపున సుప్రీంకోర్టుకు వెళ్తామని హరీశ్ రావు తెలిపారు.

# యాదగిరి గుట్ట.. టికెట్ ధర భారీగా పెంపు

తెలంగాణ: తిరుపతిగా పేరుగాంచిన యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం టికెట్ ధరను పెంచారు. ఇదివరకూ రూ.800గా ఉన్న టికెట్ ధరను రూ.1000కి పెంచుతూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా ఈ ధర పెంపు జూలై 25 నుంచి అమల్లోకి వచ్చింది. పెంచిన ధరతో భక్తులకు అదనంగా పూజా సామగ్రి అందజేయనున్నారు. అలానే కొత్తగా నిర్మించిన ప్రసాదాల కౌంటర్‌ను కూడా ప్రారంభించారు. ఆ వివరాలు..

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టను దర్శించుకునే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత.. అధికారంలో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ బడ్జెట్‌తో యాదాద్రి ఆలయాన్ని పునర్నిర్మించి ంది. ఆతర్వాత నుంచి నర్సన్న దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. పండుగలు,



సెలవు దినాల్లో వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉంటుంది. ఈక్రమంలో తాజాగా యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. ఆ టికెట్ ధర భారీగా పెంచినట్లు ప్రకటించారు.

శ్రావణమాసం అంటేనే తెలుగు రాష్ట్రాల్లో పండగల మాసంగా భావిస్తారు. ఈమాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతానికి చాలా ప్రాముఖ్యత ఉంది. మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం చేసుకుంటారు. అలానే శ్రావణమాసంలో చాలా మంది భక్తులు యాదగిరిగుట్టలో ప్రత్యేకంగా సత్యనారాయణ స్వామి వ్రతం జరిపించుకుంటారు. అయితే తాజాగా ఆలయ అధికారులు వ్రత టికెట్ ధరను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో సత్యదేవుడి వ్రత టికెట్ ధరను భారీగాపెంచారు. ఇప్పటి వరకు రూ.800 ఉన్న వ్రత టికెట్ ధరను రూ.1000కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అయితే గతంలోనే ఈ నిర్ణయం తీసుకోగా.. తాజాగా శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా నిన్నటి నుంచి అనగా జులై 25, శుక్రవారం నుంచి పెరిగిన టికెట్ ధర అమల్లోకి వచ్చింది. పెంచిన టికెట్‌పై భక్తులకు అదనంగా పూజా సామగ్రితో పాటు కల్యాణషెల్లా, కనుము, లక్ష్మీనరసింహస్వామి, సత్యనారాయణస్వామి విగ్రహాలను అందజేస్తారు.

టికెట్ ధర పెంచిన తర్వాత.. ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో వెంకట్‌రావులు శ్రావణ శుక్రవారం సందర్భంగా రూ.1000 చెల్లించి వ్రతపూజలు నిర్వహించారు. అలాగే, నూతనంగా నిర్మించిన ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఇది ఇంతకు ముందు శివాలయం ఎదురుగా ఉండేది. ప్రస్తుతం దాన్ని కొండపైన ప్రధాన ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అలాగే రింగ్‌రోడ్డుపై గల ఐదు సర్కిళ్లకు అధికారులు.. ఆంజనేయ, గరుడ, ప్రహ్లాద, రామానుజ, యాదరుషి పేర్లు ఖరారు చేసిన బోర్డులను ఏర్పాటు చేశారు. అలానే యాదగిరిగుట్ట వచ్చే భక్తుల క్యూలైన్లను వేగంగా, క్రమపద్ధతిలో నడపడంపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరుమలలోని శ్రీవాణి ట్రస్ట్ తరహాలో.. యాదగిరిగుట్టలో కూడా 'గరుడ టికెట్'ను అందుబాటులోకి తీసుకురావాలని ఆలయ అధికారులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ టికెట్ పొందిన భక్తులకు.. ఉదయం సుప్రభాత సేవ నుంచి రాత్రి స్వామివారి పవళింపు సేవ వరకు.. ఏ సమయంలోనైనా శీఘ్ర దర్శనం కల్పిస్తారు. దర్శనం తర్వాత గరుడ టికెట్ భక్తులకు ఐదు లడ్డూలు, ఒక కిలో పులిహోర ప్రసాదంగా అందిజేస్తారు.

# 2 లక్షలు తీసుకుంటూ పట్టుబడ్డ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ఫుడ్‌కోర్టు వ్యాపారిని బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేయగా, రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఫుడ్‌కోర్టులో అక్రమాలు ఉన్నాయని బెదిరించి నట్లు వ్యాపారి ఫిర్యాదు చేయడంతో ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. గతం లోనూ రవికుమార్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, సరైన ఆధారాలు లేక విచారణ జరుపుతున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు. రవికుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

తెలంగాణలో ప్రతిరోజు ఎక్కడో చోట అవినీతి అధికారులు పట్టుబడుతూనే ఉన్నారు. ఈమధ్య కాలంలో మహిళా ఉద్యోగులు కూడా లంచం తీసుకుంటూ పట్టుబడటం సంచలనంగా మారింది. ప్రతి రోజు అవినీతి అధికారులు పట్టుబడుతున్నా సరే.. మిగతా వారు ఏమాత్రం భయపడటం లేదు. లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేస్తున్నారు. తాజగా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఏకంగా 2 లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఓ ఫుడ్‌కోర్టు వ్యాపారిని బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేసి.. దానిలో అడ్వాన్స్‌గా రెండు లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి



నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్. అవినీతి నిరోధక శాఖ సిటీ రేంజ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రవి కుమార్ జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. రవి కుమార్.. సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఓ ఫుడ్ కోర్టు వ్యాపారిని బెదిరించాడు. ఫుడ్ కోర్టులో అక్రమాలు ఉన్నాయని తనకు సమాచారం అందిందని.. అందుకే తనకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. రవికుమార్ బెదిరింపుల గురించి సదరు వ్యాపారి తమకు ఫిర్యాదు చేశాడని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈక్రమంలో ఏసీబీ అధికారుల సూచన మేరకు.. సదరు ఫుడ్ కోర్ట్ వ్యాపారి రూ.2 లక్షలు ఇచ్చేందుకు డిప్యూటీ కమిషనర్ రవికుమార్ను ఒప్పించారు. ఆ తర్వాత ఫుడ్ కోర్ట్ వ్యాపారి వెళ్లి.. రవికుమార్‌కు రూ.2 లక్షలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ అధికారులు.. ఆ డబ్బు ఎందుకు తీసుకున్నారని డిప్యూటీ కమిషనర్‌ను ప్రశ్నించారు. కానీ అతడు సరైన సమాధానం చెప్పలేక పోయాడని.. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. అయితే గత కొంత కాలంగా రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌పై ఫిర్యాదులు వస్తున్నాయిని ఏసీబీ అధికారులు తెలిపారు. కాని సరైన ఆధారాలు లేక పోవడంతో విచారణ జరుపుతూ వస్తున్నామన్నారు. ఇదిలా ఉంటే.. ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్.. మొదటి నుంచి అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతూ.. విధులు సరిగా నిర్వర్తించడం లేదని పలువురు ఆరోపించారు. ఇంత భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ పట్టుబడటం సంచలనంగా మారింది. లంచం తీసుకునే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనాలు డిమాండ్ చేస్తున్నారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం..

భద్రాచలం: వద్ద గోదావరి నీటిమట్టం శనివారం ఉదయం 32.5 అడుగులు దాటింది. ఎగువ వరదలతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. పర్ణశాల, తాలిపేరు జలాశయం వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. భద్రాచలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటిం చింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో పాటు తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న విస్తారమైన వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 7 గంటలకు గోదావరి నీటిమట్టం 32.5 అడుగులు దాటి ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరుగుదలతో స్నాన ఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు వరదనీటిలో మునిగిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవాహం కొనసాగుతుండటంతో భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత పెరిగే అవకాశం



ఉందని అధికారులు హెచ్చరించారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద ప్రముఖ పర్యాటక ప్రదేశం నార చీరల ప్రాంతం వద్దకు వరద నీరు చేరడంతో పర్యాటకులను అక్కడికి వెళ్లకుండా నిలిపివేశారు. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రాచలం పట్టణంలోకి స్లూయిజ్‌ల ద్వారా వరద నీరు రాకుండా అధికారులు ముందే మోటార్లను ఏర్పాటు చేసి, పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భద్రాచలం, పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నదిలోకి వెళ్లడం, నది తీర ప్రాంతాలకు వెళ్లడం పూర్తిగా మానుకోవాలని చెప్పారు. అధికారుల నుంచి వచ్చే సమాచారం, హెచ్చరికలను తప్పకుండా పాటించాలని సూచించారు.

**తెలంగాణకు భారీ వర్ష సూచన**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణ వ్యాప్తంగా ఇవాళ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి వెళ్లవద్దని, సురక్షితంగా ఉండాలని అధికారులు సూచించారు.

# పవన్ కళ్యాణ్‌తో విభేదాలు... క్లారిటీ ఇచ్చిన దర్శకుడు క్రిష్





పవన్ కళ్యాణ్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ. పవన్ కళ్యాణ్‌తో తనకెలాంటి విబేధాలు లేవన్నారు. భవిష్యత్తులో ఆయనతో మళ్లీ సినిమా చేసేందుకే సిద్ధంగా ఉన్నానని తెలిపారు. 'హరిహర వీరమల్లు' సందర్భంగా పవన్ కళ్యాణ్, ఏఎం రత్నానికి క్రిష్ జాగర్లమూడి శుభాకాంక్షలు చెబుతూ వాళ్లపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ' హరిహర వీరమల్లు ' చిత్రం ఇటీవలే విడుదలైన ప్రేక్షకుల ఆదరాభిమానాలు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఓ వర్గం పనిగట్టుకుని నెగిటివ్ టాక్ స్ప్రెడ్ చేస్తున్నా థియేటర్లలో బాగానే రన్ అవుతోంది. శని, ఆదివారాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ బాగుండటంతో కలెక్షన్లు భారీగానే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ఏఎం రత్నం భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ ప్రాజెక్టుకి తొలుత క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించగా ఆయన తప్పుకోవడంతో జ్యోతికృష్ణ సారథ్యం వహించి సినిమా పూర్తి చేశారు. అయితే ఏఎం రత్నం, పవన్ కళ్యాణ్‌తో విభేదాలు రావడంతోనే ఆయన తప్పుకున్నట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. అయితే సినిమా ప్రమోషన్లలో క్రిష్‌పై పవన్ కళ్యాణ్ ప్రశంసలు కురిపించడం, రిలీజ్ సందర్భంగా క్రిష్ యూనిట్‌కి విషెస్ చెప్పడంతో పాటు ఏఎం రత్నం, పవన్ లాంటి లెజెండ్స్ వల్లే ఈ చిత్రం పూర్తయి థియేటర్లలోకి వస్తోందని కొనియాడారు. దీంతో పవన్, క్రిష్ మధ్య విబేధాలు అన్న వార్త ఫేక్ అని తేలిపోయింది.అయితే 'ఘాటి' చిత్ర ప్రమోషన్లలో భాగంగా వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తోన్న క్రిష్ జాగర్లమూడికి పదేపదే అవే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. దీంతో పవన్ కళ్యాణ్‌తో విబేధాల గురించి మరోసారి ఆయన క్లారిటీ ఇచ్చారు. 'పవన్ కళ్యాణ్‌తో నాకు విబేధాలున్నాయని వస్తున్న వార్తల్లో నిజం లేదు. నేను ఓపెన్‌గానే ఉన్నారు. అన్నీ అనుకూలిస్తే భవిష్యత్తులో ఆయనతో సినిమా చేసేందుకు కూడా నేను సిద్ధమే' అని అన్నారు క్రిష్. క్రిష్ తన దగ్గరికి వచ్చి 'హరిహర వీరమల్లు' సినిమా స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆ కథ లోతు చూసి ఆశ్చర్యపోయానని, చేద్దామని వెంటనే ఓకే చెప్పేశానని పవన్ కళ్యాణ్ చెప్పిన సంగతి తెలిసిందే. అయితే షూటింగ్ విషయంలో పవన్ కలగజేసుకోవడంతో ఆయన మనస్తాపం చెందిన ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారని వార్తలొచ్చాయి. అయితే రిలీజ్ సందర్భంగా పవన్ క్రిష్ గురించి మాట్లాడటం, దానికి ఆయన పాజిటివ్‌గా మాట్లాడటం ఆసక్తి రేపింది. క్రిష్ ప్రస్తుతం అనుష్క శెట్టిత 'ఘాటి' అనే మూవీ తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తికాగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. చాలాకాలం తర్వాత అనుష్క నటిస్తోన్న చిత్రం కావడంతో దీనిపై మంచి అంచనాలున్నాయి. ఇప్పటికే రెండుసార్లు రిలీజ్ వాయిదా పడటంపై అనుష్క ఫ్యాన్స్ అసహనంగా ఉన్నారు. ఈ మూవీ సెప్టెంబర్‌లో రావడం పక్కా అని తెలుస్తోంది. దీని తర్వాత ఆయన నందమూరి బాలకృష్ణతో ఓ చిత్రం చేయనున్నారని తెలుస్తోంది. ఇది 'ఆదిత్య 369' మూవీకి సీక్వెల్ అని ప్రచారం జరుగుతున్నా క్లారిటీ లేదు.

# స్పిరిట్ అప్డేట్ ఇచ్చిన సందీప్ రెడ్డి వంగా






రెబల్ స్టార్ ప్రభాస్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్లో తెరకెక్కనున్న 'స్పిరిట్' మూవీ షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఎదురుచూస్తున్న అభిమానులకు గుడ్ న్యూస్. ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ చివరి నాటికి ప్రారంభమవుతుందని సందీప్ రెడ్డి వంగా స్వయంగా ప్రకటించారు. నాన్ స్టాప్ షెడ్యూల్ తో సినిమాను పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రభాస్ ప్రస్తుతం ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో షూటింగ్ ఆలస్యమైంది.

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్ లో 'స్పిరిట్' అనే భారీ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. చాన్నాళ్ల క్రితమే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. కానీ ఇంకా సెట్స్ మీదకు వెళ్లలేదు. ఎప్పుడెప్పుడు ఈ మూవీ పట్టాలెక్కుతుందా అని డార్లింగ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ అప్డేట్ కోసం కళ్ళు కాయలు కాచేలా వేచి చూస్తున్నారు. ఇలాంటి టైంలో సందీప్ వంగా ఓ క్రేజీ న్యూస్ షేర్ చేసుకున్నారు.

'కింగ్డమ్' మూవీ ప్రమోషన్స్ లో భాగంగా విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరితో సందీప్ రెడ్డి ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా స్పిరిట్ గురించి అడగకపోతే అందరూ తనను బండ బూతులు తిడతారని, అసలు ఈ సినిమా ఏంటి? షూటింగ్ ఎప్పుడు? ఏమైనా లీక్ ఇవ్వమని విజయ్ అడుగుతారు. దీనికి సందీప్ స్పందిస్తూ ఆ సినిమాకి సంబంధించిన ప్రశ్నలు అడకగపోతేనే మంచిదని అన్నారు. లీజులేమీ లేవంటూనే షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారనే విషయాన్ని వెల్లడించారు.

"స్పిరిట్ షూటింగ్ సెప్టెంబర్ ఎండ్ లో స్టార్ట్ అవుతుంది.. నాన్ స్టాప్ గా కొట్టాలనేదే ఐడియా" అని సందీప్ రెడ్డి తెలిపారు. ఈ ప్రకటనతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఎట్టకేలకి సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సందీప్ వంగా చెప్పిన దాన్ని బట్టి చూస్తుంటే ప్రభాస్ బల్క్ డేట్స్ కోసమే ఇన్నాళ్లు వెయిట్ చేసినట్లు అర్థమవుతోంది. అప్పటికి రాజాసాబ్, హను రాఘవరెడ్డి సినిమాల్ని కంప్లీట్ చేసి, పూర్తిగా స్పిరిట్ కోసమే వర్క్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి 'యానిమల్' సినిమా విడుదలైన వెంటనే ప్రభాస్ మూవీ షూటింగ్ ప్రారంభం అవుతుందని అంతా భావించారు. దర్శక నిర్మాతలు సైతం లాస్ట్ ఇయర్ సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో స్టార్ట్ చేస్తామని చెప్పారు. కానీ అనుకున్న విధంగా జరగలేదు. ఆ తర్వాత 2024 డిసెంబర్ లో షూట్ ఉంటుందని మేకర్స్ అన్నారు. పక్కా ఈ ఏడాది సమ్మర్ లో ఉంటుందని అనుకున్నారు. కానీ ప్రభాస్ ఇతర కమిట్మెంట్స్ తో బిజీగా ఉండటంతో.. అది అలా ముందుకు సాగుతూ సాగుతూ, ఇప్పుడు 2025 సెప్టెంబర్ వరకూ వచ్చి చేరింది. మరి ఈసారైనా చెప్పిన సమయానికి 'స్పిరిట్' షూటింగ్ షురూ చేస్తారో లేదో చూడాలి. 'స్పిరిట్' అనేది ఇంటెర్నేషనల్ లెవల్ లో తెరకెక్కనున్న కాప్ డ్రామా. ఇందులో ప్రభాస్ తన కెరీర్ లోనే తొలిసారిగా పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి నటించనుంది. టీ-సిరీస్ సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ బ్యానర్స్ పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూర్చనున్నారు. తెలుగుతో సహా ఇంగ్లీష్, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, చైనీస్, జపనీస్, కొరియన్ వంటి మొత్తం 9 భాషల్లో ఈ సినిమాని రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు.

# మహేష్ బాబుతో 'అతడు' పార్ట్-2..



మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన 'అతడు' సినిమా మళ్ళీ థియేటర్లలో సందడి చేయనుంది. సినిమా రీ రిలీజ్ సందర్భంగా మురళీ మోహన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. త్రివిక్రమ్ కథ చెప్పిన విధానం, సినిమాలో హీరో పాత్ర గురించి ఆయన మాట్లాడారు. ఒకవేళ సీక్వెల్ తీస్తే మహేష్, త్రివిక్రమ్ లతోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

మరి 'అతడు 2' వస్తుందా?

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అతడు'. 2005లో విడుదలైన ఈ సినిమా ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. నటుడు మురళీ మోహన్ సమర్పణలో జయభేరి ఆర్ట్స్ బ్యానర్ లో ఈ సినిమా రూపొందింది. నిజానికి ఈ చిత్రం థియేటర్లలో పెద్దగా విజయం సాధించలేదు. కానీ బుల్లితెర మీదకు వచ్చిన తర్వాత కల్ట్ క్లాసిక్ స్టేటస్ అందుకుంది. టీవీల్లో అత్యధిక సార్లు టెలికాస్ట్ అయిన చిత్రంగా 'అతడు' రికార్డ్ క్రియేట్ చేసింది. అయితే ఈ సినిమాకి సీక్వెల్ తీయాలని మురళీ మోహన్ ఆలోచిస్తున్నారు.

'అతడు' సినిమాని మహేష్ బాబు బర్త్ డే స్పెషల్ గా ఫార్మాట్ లో రీ-రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మురళీ మోహన్ తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించారు. సినిమాకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ అప్పట్లో ఈ కథను 3 గంటల పాటు నేరేట్ చేశాడని, ప్రతీ షాట్ గురించి సవివరంగా చెబుతూ సినిమా చూస్తున్నామనే ఫీలింగ్ కలిగించాడని అన్నారు."అయితే ఆరోజుల్లో హీరో అంటే శ్రీరామచంద్రుడు అనేలా ఉండేవాడు. కానీ ఇందులో హీరో పాత్రని కాస్త నెగెటివ్ షేడ్స్ లో రాసుకున్నారు. బిగినింగ్ పార్ట్ లో హీరో క్యారక్టర్ కొంచం నెగెటివ్ గా ఉందని త్రివిక్రమ్ తో చెబితే.. ఇది ఇప్పటి రోజుల్లో ట్రెండ్ అని, యాంటీ క్యారక్టర్ ఉంటేనే జనాలు ఇష్టపడుతున్నారని సమాధానమిచ్చాడు. మా బ్రదర్ కిశోర్ కూడా ఆయన మాటతో ఏకీభవించడంతో ఎలాంటి మార్పులు చేయకుండా త్రివిక్రమ్ రాసుకున్నది రాసుకున్నట్లే తీయమని చెప్పాం" అని మురళీ మోహన్ తెలిపారు.

ఈ సందర్భంగా 'అతడు' సీక్వెల్ గురించి మురళీ మోహన్ మాట్లాడుతూ.. "పార్ట్-2 తీస్తే తప్పకుండా మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ లతోనే చేయాలి. మారిస్తే అసలు జనం ఒప్పుకోరు. మహేష్ డేట్స్ ఇచ్చి త్రివిక్రమ్ చేద్దాం అంటే కనుక, వంద శాతం జయభేరి బ్యానర్ లో నిర్మిస్తాం. 'అతడు 2' చేయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. అప్పట్లో సీక్వెల్స్, రెండు మూడు సినిమాలు, పార్ట్ 2, పార్ట్ 3లు లేవు కాబట్టి.. అప్పుడు ఒక్క సినిమాతో ఆగిపోయింది. కానీ ఇప్పుడు తీస్తే చాలా మంచి సబ్జెక్ట్ అవుతుంది. ఆ కాంబినేషన్ కి కూడా మంచి క్రేజ్ ఉంది. ఈతరం యంగ్ స్టర్స్ అందరూ రీ-రిలీజ్ చూసి పార్ట్-2 తీస్తే బాగుంటుందని అంటే కచ్చితంగా ఆ దిశగా ఆలోచన చేస్తాం" అని మురళీ మోహన్ అన్నారు. 'అతడు' సినిమాని రీ-రిలీజ్ చేయాలని రెండేళ్ల నుంచి ఎంతోమంది అడిగారని, ఆ రోజుల్లో ఈ చిత్రాన్ని బిగ్‌స్క్రీన్‌పై ఎక్కువమంది చూడలేదని, కానీ టీవీల్లో చూసి చాలా బాగుందన్నారని మురళీ మోహన్ చెప్పారు. అలాంటి వారందరూ ఇప్పుడు థియేటర్‌లలో చూసి ఎంజాయ్ చేస్తారని నమ్మకం ఉందన్నారు. ఫైనాన్సియల్ గా ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోయినప్పటికీ, ఈ సినిమా వల్ల తమకుల ఒక్క రూపాయి కూడా లాస్ లేదని తెలిపారు. టీవీల్లో అత్యధికసార్లు టెలికాస్ట్ అయిన సినిమా 'అతడు' అని పేర్కొన్నారు. తెలుగులో హయ్యెస్ట్ థియేటర్లలో రీరిలీజ్ అవ్వబోతున్న సినిమా ఇదేనని నిర్మాత కిశోర్ అన్నారు.

# అదిరిపోయిన ఫస్ట్ సింగిల్

'హనుమాన్' తర్వాత తేజా సజ్జా హీరోగా వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో తేజ యోధుడిగా నటిస్తుండగా, మంచు మనోజ్ విలన్‌గా కనిపించనున్నాడు. సెప్టెంబర్ 5న ఈ సినిమా 2డీ, 3డీ ఫార్మాట్లలో 8 భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ 'వైబ్ ఉంది బేబీ' సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇక హిందీలో ఈ మూవీ థియేట్రికల్ రైట్స్‌ను కరణ్ జోహార్ సొంతం చేసుకోవడం సినిమాకు ప్లస్ పాయింట్‌గా నిలిచింది.

బాలనటుడిగా ఎన్నో సినిమాల్లో నటించిన తేజా సజ్జా .. ఇప్పుడు హీరోగా మారి స్టార్ హీరలనే టెన్షన్ పెడుతున్నాడు. 'ఓ బేబీ' చిత్రంలో సపోర్టింగ్‌లో రోల్ చేసి తేజ.. ఆ తర్వాత జాంబీ రెడ్డి, ఇష్క్ నాట్ ఏ లవ్ స్టోరీ, అద్భుతం చిత్రాలతో యూత్ హీరోగా పేరు తెచ్చుకున్నాడు. ఇక ప్రశాంత్ వర్మ డైరెక్షన్లో వచ్చిన 'హనుమాన్' చిత్రం అతడికి బిగ్ బ్రేక్ ఇచ్చింది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా పాన్ ఇండియా లెవల్‌లో ఏకంగా రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. దీంతో తేజా సజ్జా క్రేజ్ నేషనల్ లెవల్‌లో ఎక్కడికో వెళ్లిపోయింది. అదే టెంపోని కంటిన్యూ చేస్తూ ఈసారి ' మిరాయ్ 'గా వచ్చేందుకు సిద్ధమయ్యాడు.

పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్న ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నాడు. 'హనుమాన్'లో దైవ శక్తులు కలిగిన యువకుడిగా



మెప్పించిన తేజ.. ఇందులో యోధుడిగా కనిపించనున్నాడు. ఇక మంచు మనోజ్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సెప్టెంబర్ 5న 2డీ, 3డీ ఫార్మాట్లలో మొత్తం 8 భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో మేకర్స్ అప్పుడే ప్రమోషన్లు మొదలుపెట్టేశారు. ఈ క్రమంలోనే తాజాగా ఫస్ట్ సింగిల్‌ని శనివారం రిలీజ్ చేశారు. 'వైబ్ ఉంది బేబీ' అంటూ సాగే సాంగ్‌కి కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, అర్మాన్ మాలిక్ గొంతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యూత్‌ని టార్గెట్ చేస్తూ రూపొందించిన ఈ సాంగ్ సోషల్‌మీడియాని ఊపేస్తోంది.

'హనుమాన్' వంటి ట్రిపుల్ బ్లాక్‌బస్టర్ తర్వాత తేజ సజ్జా నుంచి వస్తోన్న చిత్రం కావడంతో 'మిరాయ్'పై భారీ అంచనాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ బెల్ట్‌లోనూ ఈ సినిమా థియేట్రికల్ రైట్స్ దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. ఇక హిందీలో ఈ మూవీకి జాక్‌పాట్ తగిటినట్లు తెలుస్తోంది. ఈ సినిమా హిందీ రైట్స్ దక్కించుకునేందుకు బాలీవుడ్ బడా ప్రొడ్యూసర్ కరణ్ జోహార్ రంగంలోకి దిగారు. గతంలో బాహుబలి, దేవర లాంటి చిత్రాలతో హిందీ కోట్ల రూపాయల లాభాలు సంపాదించిన కరణ్.. తాజాగా 'మిరాయ్' మేకర్స్‌తో అదిరిపోయే డీల్ చేస్తుకున్నాడట. కరణ్ జోహార్ తన సినిమాల్ని ఏ రేంజులో ప్రమోట్ చేస్తాడో అందరికీ తెలిసిందే. బాలీవుడ్‌లో ఆయనకి భారీ క్రేజ్ ఉంది. తన సినిమాలకు ప్రమోషన్ల విషయంలో ఎవరూ ఊహించని స్ట్రాటజీ అమలు చేస్తుంటాడు. ఇవన్నీ చూసుకునే 'మిరాయ్' మేకర్స్ కరణ్ జోహార్ అడగ్గానే థియేట్రికల్ రైట్స్ అతడికి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ రకంగా చూస్తే 'మిరాయ్' మూవీకి ఇది చాలా సానుకూల అంశమని అంటున్నారు.

# నన్ను కూడా చంపడానికి ట్రై చేస్తున్నారు...



'వీరభద్ర' సినిమాతో తెలుగు ప్రేక్షకుల పరిచయమైన బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా. పుష్కరకాలం క్రితమే సినిమాలకు దూరమైన ఈ భామ.. సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు టచ్ లో ఉంటున్నారు. అప్పుడప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. ఇటీవల తన ఇంట్లోనే తాను వేధింపులకు గురవుతున్నానంటూ ఆమె ఓ వీడియో పోస్ట్ చేయడం సంచలనంగా మారింది. అయితే ఇప్పుడు తాజాగా బాలీవుడ్ పై తనుశ్రీ చేసిన కామెంట్స్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి.

తనుశ్రీ దత్తా ఓ మీడియా ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా తాను ఆధ్యాత్మిక జీవనశైలికి అలవాటుపడ్డానని, అందుకే ఎక్కువగా మీడియా ముందుకు రావడం లేదని తెలిపారు. తనపై జరిగిన వేధింపుల గురించి చేసిన వీడియో వైరల్ అయినప్పటి నుంచి ఇంటర్వ్యూల కోసం ఎంతోమంది ఫోన్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "నా ఆరోగ్యం బాగా లేదు. అయినా సరే కొన్ని రోజుల నుంచి వరుసగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటూనే ఉన్నాను. నేను అందరితో మాట్లాడతాను, కాకపోతే దానికి టైం పడుతుంది. దయచేసి నన్ను ప్రశాంతంగా ఉండనీయండి" అని ఆమె విజ్ఞప్తి చేశారు. మరో మీడియా సంస్థతో మాట్లాడుతూ "బాలీవుడ్ మాఫియా చాలా పెద్దది. బాంబేలో నా ప్రాణానికి ముప్పు ఉంది. హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ లాగానే నా ప్రాణం కూడా ప్రమాదంలో ఉంది. అతడిలానే నన్ను కూడా చంపడానికి ట్రై చేస్తున్నారు" అని తనుశ్రీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో హిందీ చిత్ర పరిశ్రమపై ఆమె తీవ ఆరోపణలు చేశారు. బాలీవుడ్ సీనియర్ నటుడు నానా పటేకర్ తనను ఇబ్బంది పెట్టాడని చెప్పడం అప్పట్లో సంచలనమైంది. ఇప్పుడు తన ప్రాణానికి హాని ఉందని చెప్పాడం చర్చనీయాంశంగా మారింది.

# హైట్ పెద్ద సమస్యే కాదు..



హీరోయిన్ ఇవానా తన ఎత్తుపై జరుగుతోన్న ట్రోలింగ్‌పై మరోసారి స్పందించింది. ఎత్తు అనేది ఇండస్ట్రీలో సమస్యే కాదు. ఎంతోమంది పొట్టిగా ఉన్నా ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. నేను ఎత్తు తక్కుగా ఉన్నా సినిమాలో హైట్‌గా చూపించొచ్చు. ఇప్పుడున్న టెక్నాలజీతో ఇదేం పెద్ద సమస్యే కాదు. హీరో ఆరు అడుగుల ఎత్తున్నా నేను మేనేజ్ చేయగలను. ప్రేక్షకులు మనం ఎంత బాగా నటిస్తున్నామని చూస్తారే తప్ప ఎత్తుగా ఉన్నామా.. పొట్టిగా ఉన్నామా అని చూడరు అని తెలిపింది ఇవానా.

టీనేజ్‌లోనే సినిమాల్లోకి వచ్చి 'లవ్‌టుడే'తో హీరోయిన్‌గా మారింది కేరళ బ్యూటీ ఇవానా అమె అసలు పేరు ఎలీనా షాజీగా కాగా.. సినిమాల కోసం ఇవానా అని పేరు మార్చుకుంది. . 'సింగిల్'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ అందుకున్న ఇవానా ఇక్కడే పాగా వేయాలని గట్టిగానే ప్లాన్స్ వేస్తున్నట్లు తెలుస్తోంది. అందం, టాలెంట్ ఉన్నప్పటికీ ఎత్తు తక్కువగా ఉండటంతో ఆమెపై ట్రోలింగ్ జరుగుతోంది. అయితే ఇవానాకు ఇప్పుడే కాదు స్కూల్ డేస్ నుంచి ఎత్తు గురించి ఎన్నో అవమానాలు పడిందట. చిన్నప్పటి నుంచి ఎత్తు తక్కువగా ఉండటంతో స్కూల్‌లో ఫ్రెండ్స్ అందరూ పొట్టి అని పిలిచేశారని.. ఆ మాటలు చాలా బాధ పెట్టడంతో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోయేదాన్నని ఇవానా తెలిపింది.

తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఎత్తు గురించి ఇవానా మరోసారి స్పందించింది. 'ఎత్తు అనేది సమస్యే కాదు. రష్మిక మందానా, నిత్యా మీనన్‌లు కూడా పెద్ద ఎత్తేం కాదు. కానీ వాళ్లని ప్రేక్షకులు ఆదరించలేదా?. రష్మిక నేషనల్ క్రష్ అయింది, నిత్యామీనన్ జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఎత్తుతో వాళ్లకి రాని ఇబ్బంది నాకెందుకు వస్తుంది. హీరో ఎంత ఎత్తున్నా మేనేజ్ చేయగల కెపాసిటీ నాకుంది. ఇక్కడ ఎత్తు సమస్య కాదు ఎలా నటించామన్నదే ముఖ్యం. యాక్టింగ్ బాగా చేస్తే తెరపై ఎత్తు గురించి ఎవరూ పట్టించుకోరు. ఎవరిని ఎలా చూపించాలన్నది డీవోపీ చేతిలో ఉంటుంది. ఇప్పుడున్న టెక్నాలజీతో నన్ను హైట్‌గా చూపించడం పెద్ద కష్టమేమీ కాదు. ఆరడుగుల ఎత్తున్న హీరోల పక్కనైనా నటించేందుకు నేను సిద్ధంగా ఉన్నా' అంటూ చెప్పుకొచ్చింది ఇవానా.

12 ఏళ్లకే మలయాళంలో 'మాస్టర్స్' చిత్రంతో బాలనటిగా ఎంట్రీ ఇచ్చిన ఇవానా.. ఇంటర్‌లో ఉండగా 'నాచియార్' అనే తమిళ మూవీలో నటించింది. జ్యోతిక పోలీస్ ఆఫీసర్‌గా నటించిన ఆ సినిమా తెలుగులో 'ఝాన్సీ' పేరుతో డబ్ అయింది. అందులో ఇవానా డీగ్లామర్‌గా కనిపిస్తుంది. 'లవ్‌టుడే'తో హీరోయిన్‌గా మారి బ్లాక్‌బస్టర్ అందుకుంది. ఆ తర్వాత 'డ్రాగన్'లో క్లైమాక్స్‌లో సడెన్ ఎంట్రీ ఇచ్చి ఆకట్టుకుంది. ఇక తెలుగులో శ్రీవిష్ణు సరసన 'సింగిల్' మూవీలో నటించి మెప్పించింది. మరో హీరోయిన్ కేతికా శర్మతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవాల్సి వచ్చినా ఇవానా క్యారెక్టర్‌కి ప్రేక్షకులు బాగానే కనెక్ట్ అయ్యారు. తాజాగా ఆ బ్యూటీ నక్కిన త్రినాథరావు డైరెక్షన్లో తెరకెక్కించే మూవీలో ఛాన్స్ కొట్టేసినట్లు వార్తలొస్తున్నాయి.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,